
Truth of News
RNI NO : APTEL/25/A0239
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్
సంపుటి: 01 | అన్నమయ్య జిల్లా | సంచిక : 253 | గురువారం 05 మార్చి 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50
Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

మహాత్మా గాంధీ

"మరణానికి భయపడటమంటే చిరిగిపోయిన బట్టని వదిలేందుకు భయపడటం."



IRS PUBLICATIONS
irspublications12@gmail.com

# యుద్ధంలో కంపిస్తున్న ఇరాన్

- 20 పాఠశాలలపై బాంబుల వర్షం..
- 170 మంది విద్యార్థులు, ఉపాధ్యాయుల మృతి
- ఇరాన్‌లోని 20 పాఠశాలలపై వైమానిక దాడులు
- దీనిని యుద్ధ నేరంగా పేర్కొన్న ఇరాన్ ప్రభుత్వం
- దాడులను తీవ్రంగా ఖండించిన ఐక్యరాజ్యసమితి
- ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ హెచ్చరిక



టెహ్రాన్- సూర్య వాస్తవం

మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు పెను విషాదాన్ని మిగిల్చాయి. ఇరాన్‌లోని పలు పాఠశాలలే లక్ష్యంగా జరిగిన వైమానిక దాడుల్లో 170 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు మరణించారు. దేశవ్యాప్తంగా సుమారు 20 విద్యాసంస్థలపై ఈ దాడులు జరిగాయని, మృతుల సంఖ్యను ఇరాన్ విద్యాశాఖ మంత్రి బుధవారం అధికారికంగా ధ్రువీకరించారు. ఈ ఘటన ప్రపంచవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది. బుధవారం ఉదయం తరగతులు జరుగుతున్న సమయంలో ఈ దాడులు చోటుచేసుకోవడంతో మృతుల సంఖ్య భారీగా పెరిగింది. టెహ్రాన్‌తో పాటు ఇతర ప్రధాన నగరాల్లోని పాఠశాలల భవనాలు పేలుళ్ల ధాటికి కుప్పకూలాయి. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు

- మిగతా 2లో..

# భారత్‌కు రష్యా భరోసా

- గల్ఫ్ సంక్షోభం వేళ ఇంధన సాయానికి సిద్ధం
- యుద్ధం ముదిరితే అదనపు చమురు సరఫరాకు మాస్కో హామీ
- దేశంలో 50 రోజులకు సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయన్న కేంద్రం
- అంతర్జాతీయంగా పెరుగుతున్న ముడిచమురు ధరలతో ఆందోళన
- పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు తెలిపిన పెట్రోలియం శాఖ



న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

పశ్చిమాసియాలో ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న వేళ, భారత్‌కు దాని మిత్రదేశం రష్యా అండగా నిలిచింది. యుద్ధ పరిస్థితుల

- మిగతా 2లో..



## ఇరాన్ సుప్రీం నేతగా ఖమేనీ కుమారుడు?

టెహ్రాన్ - సూర్య వాస్తవం

ఇరాన్ మత పెద్ద ఆయతుల్లా అలీ ఖమేనీ హత్యకు గురైన నేపథ్యంలో ఆయన వారసుడిగా కొత్త నేతను నియమించేందుకు ఇరాన్ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఖమేనీ కుమారుడు ముజ్తబాను సుప్రీం నేతగా గుర్తించినట్లు తెలిపింది. దీనిపై త్వరలో ప్రకటన వెలువడనుంది. కాగా, ఖమేనీ వారసుడుగా ఎవరిని నియమించినా కూడా వదిలిపెట్టేది లేదని ఇజ్రాయిల్ రక్షణ మంత్రి హెచ్చరించారు.

**చర్చలు జరిపేది లేదు**

అమెరికాతో ఏ విధమైన చర్చలు జరిపే ఉద్దేశ్యమే లేదని ఇరాన్ స్పష్టం చేసింది. తామనుకున్నంత కాలమూ యుద్ధాన్ని కొనసాగిస్తామని ఖమేనీకి సీనియర్ సహచరుడు మహ్మద్ మొక్బర్ ప్రకటించారు. మరోవైపు అంతర్జాతీయ ఇంధన భద్రతకు కీలకమైన హోర్ముజ్ కాలవపై పూర్తి నియంత్రణ తమకు వుందని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ ప్రకటించింది. గల్ఫ్ వ్యాప్తంగా అమెరికా దౌత్య కార్యాలయాలను లక్ష్యంగా చేసుకుని దాడులు జరపడాన్ని ఇరాన్ ఉధృతం చేసింది. ఇందులో భాగంగా దుబారులోని అమెరికా కాన్సులేట్‌పై డ్రోన్ దాడి జరిగింది. ఇజ్రాయిల్‌లోని పలు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ క్షిపణులు దూసుకువచ్చాయి.

ఇరాన్ అణు స్థావరాలకు ఎలంటి నష్టం వాటిల్లలేదని ఐఎఇఎ బుధవారం చెప్పింది. ఎక్కడా ఎలాంటి అణు ధార్మికత వెలువడలేదని తాజా ఉపగ్రహ చిత్రాల ఆధారంగా ఈ నిర్ధారణకు వచ్చినట్లు తెలిపింది.

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## 26 రకాల వివరాలతో
# ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ కార్డు

- అసెంబ్లీ చాంబర్‌లో ఎఫ్‌బీఎంఎస్‌పై సీఎం చంద్రబాబు సమీక్ష
- వివిధ శాఖల నుంచి సమాచారాన్ని సమీకృతం చేయాలని సూచన
- ఏప్రిల్ 30 నాటికి 90 శాతం డేటాబేస్ సిద్ధం చేయనున్న అధికారులు
- 26 రకాల అంశాలతో పకడ్బందీగా డేటాబేస్ రూపొందించాలన్న సీఎం

అమరావతి - సూర్య వాస్తవం



రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఒకే గొడుగు కిందకు తెచ్చేలా రూపొందిస్తున్న 'ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' (ఎఫ్‌బీఎంఎస్)పై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా అసెంబ్లీలోని తన చాంబర్‌లో అధికారులతో ఆయన కీలక సమీక్ష నిర్వహించారు. ఫ్యామిలీ ఐడీ, ఆధార్, రైస్ కార్డ్, మొబైల్ నెంబర్, విద్యార్హతలు, వృత్తి, చిరునామా, వ్యవసాయ భూమి, ఇతర ఆస్తుల వివరాలు వంటి మొత్తం 26 రకాల అంశాలతో పకడ్బందీగా డేటాబేస్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ డేటాబేస్ రూపకల్పన కోసం ఎస్‌జీఎస్‌డబ్ల్యూ, డిస్కమ్స్, పురపాలక శాఖ, వెబ్‌ల్యాండ్, వాహన్, హెచ్‌ఆర్‌ఎంఎస్, పంచాయతీరాజ్, మార్క్‌ఫెడ్ వంటి వివిధ ప్రభుత్వ శాఖల వద్ద ఉన్న సమాచారాన్ని సేకరించి ఇందులో పొందుపరచాలని సీఎం సూచించారు. ప్రస్తుతం 82 శాతం సమాచారం సిద్ధంగా ఉందని, వచ్చే ఏప్రిల్ 30 నాటికి 90 శాతం డేటాబేస్ పూర్తిచేస్తామని అధికారులు వివరించారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి.. ప్రభుత్వంలోని అన్ని శాఖల వద్ద ఉన్న డేటాను సమీకృతం చేయడం ద్వారానే సమాచారంలో కచ్చితత్వం పెరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి 'ఫ్యామిలీ కార్డు' అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, దీనికి అనుగుణంగా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని చంద్రబాబు స్పష్టం చేశారు.

## చిత్తూరు జిల్లాలో
# ఘోర రోడ్డు ప్రమాదం

- ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు దుర్మరణం
- దైవదర్శనానికి వెళ్తూ మృత్యు ఒడిలోకి



గంగవరం- సూర్య వాస్తవం

చిత్తూరు జిల్లాలో బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు.

- మిగతా 2లో..



# అదనంగా ఐపీఎస్‌లను కేటాయించండి

- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాకు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి
- మావోయిస్టుల లొంగుబాటు, పునరావాసంపై కేంద్రమంత్రితో చర్చలు
- మూడు గంటల పాటు సుదీర్ఘ సమావేశంలో పలు అంశాల ప్రస్తావన

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

తెలంగాణ రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా ఐపీఎస్ అధికారుల సంఖ్యను కేటాయించాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. బుధవారం రాత్రి అమిత్‌షాతో రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. మూడు గంటల పాటు సాగిన సుదీర్ఘ సమావేశంలో పలు అంశాల

- మిగతా 2లో..

## మండలిలో మతం మంటలు

- మంత్రి అచ్చెన్న వివాదాస్పద వాఖ్యలు
- తిరుమల 'లడ్డూ'పై చర్చలో గందరగోళం

2 పేజీ

## వర్సిటీలను బంధుగణంతో నింపేసి భ్రష్టుపట్టించారు

2 పేజీ

# యుద్ధంలో కంపిస్తున్న ఇరాన్

(మొదటిపేజీ తరువాయి)

సహాయక బృందాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. చెల్లాచెదురైన పుస్తకాలు, శిథిలాల మధ్య భయంతో చిన్నారులు పరుగులు తీస్తున్న దృశ్యాలు విషాదాన్ని నింపుతున్నాయి. పాఠశాలలపై దాడులు చేయడం అంతర్జాతీయ చట్టాల ప్రకారం 'యుద్ధ నేరం' అని ఇరాన్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఇది చిన్నారులపై జరిగిన ఊచకోత అని విద్యాశాఖ మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, సైనిక స్థావరాలను పాఠశాలల ముసుగులో నిర్వహిస్తున్నందువల్లే దాడులు చేయాల్సి వచ్చిందని ప్రత్యర్థి వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఈ ఘటనపై ఐక్యరాజ్యసమితి సహా పలు అంతర్జాతీయ సంస్థలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశాయి. మరోవైపు, ఈ దాడులకు ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ హెచ్చరించడంతో ఉద్రిక్తతలు మరింత పెరిగే ప్రమాదం కనిపిస్తోంది.

# భారత్‌కు రష్యా భరోసా

(మొదటిపేజీ తరువాయి)

కారణంగా గల్ఫ్ దేశాల నుంచి ముడిచమురు సరఫరాలో ఆటంకాలు ఏర్పడితే, భారత్‌కు అవసరమైన అదనపు ఇంధనాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నామని మాస్కో భరోసా ఇచ్చింది. కీలకమైన హోర్ముజ్ జలసంధి మీదుగా రవాణా ప్రమాదకరంగా మారవచ్చన్న ఆందోళనల నేపథ్యంలో రష్యా ప్రకటన భారత్‌కు వ్యూహాత్మకంగా పెద్ద ఊరటనిచ్చింది. దేశంలో ఇంధన కొరత ఏర్పడవచ్చనే ఊహాగానాలపై కేంద్ర పెట్రోలియం శాఖ స్పష్టత ఇచ్చింది. ప్రస్తుతం దేశీయంగా 50 రోజులకు సరిపడా ఇంధన నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ఇందులో 25 రోజుల ముడిచమురు, మరో 25 రోజుల రిఫైన్డ్ ఉత్పత్తులు ఉన్నాయని తెలిపింది. స్వల్పకాలంలో సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీ ధీమా వ్యక్తం చేశారు. పరిస్థితిని పర్యవేక్షించేందుకు 24 గంటల కంట్రోల్ రూమ్‌ను కూడా ఏర్పాటు చేశారు. సరఫరా పరంగా భరోసా ఉన్నప్పటికీ, అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 80 డాలర్లు దాటింది. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ధరలు సుమారు 10 శాతం పెరిగాయి. ఇది భారత్ దిగుమతి బిల్లుపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ పరిణామాలు దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలకు దారితీయవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. మరోవైపు, విమాన ఇంధన (ఏటీఎఫ్) నిల్వలపై కూడా పౌర విమానయాన శాఖ ప్రత్యేకంగా దృష్టి సారించింది.

# చిత్తూరు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)



గంగవరం సిఐ రాంభూపాల్ తెలిపిన వివరాల మేరకు... బెంగళూరుకు చెందిన ఒకే కుటుంబంలోని ఐదుగురు బుధవారం తెల్లవారు జామున తిరుమలకు కారులో వస్తున్నారు. అతివేగంగా వెళు్తన్న వారి కారు చిత్తూరు జిల్లా గంగవరం మండలం వైఎస్ఆర్ జంక్షన్ సమీపంలో తొమ్మిది గంటల ప్రాంతంలో సిమెంట్ లారీని వెనుక భాగంలో బలంగా ఢకొట్టింది. దీంతో, కారులోని మోహన్ దాస్ (71), నాగరాజురావు (61), కుసుమ (61), జయంతి (59), పూజ (33) అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయారు. సిఐ రాంభూపాల్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. కారు డ్రైవర్ నిద్రమత్తులో ఉండడం, కారును అతివేగంగా నడపడం వల్ల ఈ ప్రమాదం జరిగిందని ఆయన తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

# అదనంగా ఐపీఎస్‌లను కేటాయించండి

(మొదటిపేజీ తరువాయి)

గురించి ప్రస్తావించారు. రాష్ట్ర విభజన అనంతరం 2016లో మొదటి క్యాడర్ రివ్యూ జరిగిందని, 2021లో జరగాల్సిన క్యాడర్ రివ్యూ చాలా ఆలస్యంగా 2025లో జరిగిందని రేవంత్‌రెడ్డి అన్నారు. ఆ సమయంలోనూ కేవలం ఏడుగురు ఐపీఎస్ అధికారులను మాత్రమే తెలంగాణకు కేటాయించారని సీఎం వివరించారు. దేశంతో పాటు తెలంగాణ రాష్ట్రం సైబర్ నేరాలు, డ్రగ్స్, వైట్ కాలర్ నేరాలు సహా ఇతర అనేక ఆధునిక సవాళ్లను ఎదుర్కొంటోందని సీఎం తెలిపారు. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్ల పునర్వ్యవస్థీకరణ, ఫ్యూచర్ సిటీ, హైదరాబాద్ నగరంలో భారీగా పెరుగుతున్న జనాభా నేపథ్యంలో పెద్ద సంఖ్యలో ఐపీఎస్ అధికారుల అవసరం ఉందని కేంద్రమంత్రి అమిత్ షాకు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. మూడో క్యాడర్ రివ్యూను నిర్దేశిత 2026 సంవత్సరంలోనే చేపట్టాలని కేంద్రమంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం 83 మంది ఐపీఎస్ అధికారులు రాష్ట్రంలో ఉన్నారని, ఆ సంఖ్యను 103కు పెంచి కేటాయించాలని సీఎం కోరారు. అనంతరం మావోయిస్టుల లొంగుబాటుపై అమిత్‌షాతో రేవంత్‌రెడ్డి చర్చించారు. ఇటీవల మావోయిస్టు అగ్ర నాయకుల లొంగుబాటు, వారి పునరావాసం అంశాలు వారి మధ్య చర్చకు వచ్చాయి. గత రెండేండ్లలో తెలంగాణ పోలీసింగ్‌లో గణనీయమైన మార్పులు వచ్చాయని సీఎం తెలిపారు. రాష్ట్రంలో 591 మంది మావోయిస్టులు ఆయుధాలను వీడి జనజీవన స్రవంతిలో కలిసిన విషయాన్ని కేంద్రమంత్రి అమిత్‌షా దృష్టికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకెళ్లారు. ఇటీవల కాలంలో పలువురు మావోయిస్టు అగ్రనేతలు కూడా సాధారణ జీవితం గడిపేందుకు ముందుకు వచ్చారని, వారికి నిబంధనల ప్రకారం అందజేస్తున్న పరిహారం, పునరావాసం విషయాలను కేంద్రమంత్రికి సీఎం తెలియజేశారు. రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించి సహకరించాలని కేంద్రమంత్రిని సీఎం కోరారు. సమావేశంలో ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రెటరీ వి.శేషాద్రి, రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి, ఇంటెలిజెన్స్ అడిషనల్ డీజీపీ విజయ్ కుమార్, ఎస్ఐబీ ఐజీపీ బి. సుమతి పాల్గొన్నారు.

# మండలిలో మతం మంటలు

- మంత్రి అచ్చన్న వివాదాస్పద వాఖ్యలు
- తిరుమల 'లడ్డూపై చర్చలో గందరగోళం

**అమరావతి - సూర్య వాస్తవం**



శాసన మండలిలో బుధవారం తిరుమల లడ్డూపై జరిగిన చర్చలో తీవ్ర గందరగోళం చెలరేగింది. మండలిలో లఘు చర్చ సందర్భంగా టిడిపి, వైసిపి సభ్యుల మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం జరిగింది. మంత్రి కె.అచ్చెన్నాయుడు మాట్లాడుతూ మత ప్రస్తావన చేశారు. 'అధ్యక్షా మీరు క్రిస్టియన్... ఆయన క్రిస్టియన్...' అంటూ ఏదో చెప్పబోవడంతో వైసిపి సభ్యులు తీవ్ర స్థాయిలో అభ్యంతరం చెప్పారు. అచ్చెన్నాయుడు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. అధ్యక్ష స్థానానికి మతం ఎలా ఆపాదిస్తారని ప్రశ్నించారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఛైర్మన్ మోషేన్ రాజు జోక్యం చేసుకుంటూ తాను క్రిస్టియన్‌ను కానని, హిందువునని స్పష్టం చేశారు. దీంతో వైసిపి సభ్యులు మరింత ఉధృతంగా తమ ఆందోళనను కొనసాగించారు. మంత్రి బేషరత్తుగా క్షమాపణ చెప్పి తీరాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. వారి నిరసనల మధ్యే 'నేను ధృడంగా నమ్మాను. అయితే, సభలో మీరు క్రిస్టియన్ కాదని, హిందువునని చెప్పారు. నేను నా తప్పును ఒపుకుంటున్నాను' అని అన్నారు. అయితే బేషరత్తుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ వైసిపి సభ్యులు నిరసన కొనసాగించారు. పోడియం పైకి ఎక్కి నినాదాలు చేశారు. దీంతో అచ్చెన్నాయుడు క్షమాపణ చెప్పారు. 'అయితే, జగన్‌ను మాత్రం క్రిస్టియన్‌గానే చెబుతాను' అని అన్నారు. దీంతో సభలో మరోసారి తీవ్ర స్థాయిలో గందరగోళం చోటుచేసుకుంది. సభలో లేని వ్యక్తి పేరు ఎలా తీసుకుంటారని వైసిపి సభ్యులు ప్రశ్నించారు. ఈ గందరగోళం మధ్యే ఛైర్మన్ సభను గురువారానికి వాయిదా వేశారు. అంతకు ముందు తిరుమల లడ్డూపై లఘు చర్చ ప్రారంభం కాకముందే వాద ప్రతివాదనలు జరిగాయి. ముందుగా ప్రభుత్వం తరుపున ప్రకటనకు అనుమతి ఇవ్వాలని మంత్రి పయ్యావుల కేశవ్ పట్టుబట్టారు. లఘు చర్చలో మంత్రికి ముందుగా ప్రకటన చేసే అవకాశం ఉండదని ఛైర్మన్ స్పష్టం చేశారు. వైసిపి ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డికి మాట్లాడాలని ఛైర్మన్ ప్రకటించిన వెంటనే మంత్రి పయ్యావుల అడ్డుపడ్డారు. ఇండిపెండెంట్ ఎమ్మెల్సీ వైసిపిలో ఎప్పుడు చేరారరటూ మంత్రి ప్రశ్నించారు. దీనిపై ఎటువంటి వివరణ ఇవ్వకుండానే చంద్రశేఖర్‌రెడ్డి లడ్డూకు నెయ్యి సరఫరా అంశంపై మాట్లాడేందుకు ఛైర్మన్ అంగీకరించారు. ఆయన మాట్లాడుతూ తిరుమల పవిత్రతను టిడిపి ప్రభుత్వం ఒక పథకం ప్రకారం దెబ్బతీసిందన్నారు. తొలుత లేని కొవ్వును ఉన్నట్టు ప్రచారం చేసిన సిఎం చంద్రబాబు నాయుడు సుప్రీంకోర్టులో సిబిఐ సిట్ అఫిడవిట్ దాఖలు చేసిన తరువాత రసాయనాలు ఉన్నాయని కొత్త పల్లవిని అందుకున్నారని తెలిపారు. చంద్రబాబు ఎన్‌డిడిబి నివేదిక ప్రకారం మాట్లాడారని వ్యక్తిగతంగా ఆరోపణలు చేయలేదని మంత్రులు పయ్యావుల, అచ్చెన్నాయుడు తెలిపారు. సిఎం అసత్య ఆరోపణలు చేసి ప్రజల మనోభావాలు దెబ్బతీశారని చెబుతూ చంద్రశేఖర్ రెడ్డి పలు అంశాలను ప్రస్తావించారు. నెయ్యి కిలో రూ.321 నుంచి రూ.658కి పెంచుకోవడం కోసం ఇంత దారుణంగా ప్రవర్తించడం అవసరమా అని ప్రశ్నించారు. ఇందాపూర్ డెయిరీ ముసుగులో హెరిటేజ్ సంస్థ తిరుమలకు నెయ్యి సరఫరా చేయడానికి పథకం రూపొందించారని తెలిపారు. టిడిపి సభ్యురాలు పంచుమర్తి అనురాధ మాట్లాడుతూ వైసిపి హయంలోనే నెయ్యిలో కల్తీ జరిగిందని వైవి సుబ్బారెడ్డి అంగీకరించారని గుర్తు చేశారు. వైసిపి సభ్యులు తూమాటి మాధవరావు మాట్లాడుతూ సుప్రీంకోర్టులో సిబిఐ నివేదిక ఇచ్చిన తరువాత మళ్లీ ఏకసభ్య కమిషన్‌ను ఎందుకు నియమించారని తెలిపారు. సంగం డెయిరీ ఆవు పాలు సేకరించడం లేదని అయినా వారికి నెయ్యి సరఫరా కాంట్రాక్టు ఇచ్చారన్నారు.

**మంత్రి ఆనంతో వాగ్వావాదం**

మంత్రి అనం రామనారాయణరెడ్డికి ఎమ్మెల్సీ మాధవరావు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. మాధవరావు పోడియం వైపునకు వెళ్తుండగా మంత్రి అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో వాగ్వాదం చోటుచేసుకుంది. ఇతర మంత్రులు జోక్యం చేసుకుని సర్దిచెప్పారు.

**కల్తీ నివారణకే నెయ్యి ధర పెంచాం : లోకేష్**

మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ కల్తీ నివారణకే నెయ్యి ధర పెంచామని మంత్రి నారా లోకేష్ తెలిపారు. తన కుమారుడు పుట్టిన రోజున లడ్డూ నాణ్యతపై అనుమానం వచ్చి పరిశీలించగా కల్తీ నెయ్యి విషయం బయటకు వచ్చిందన్నారు. నెయ్యిలో కల్తీ జరిగిందని ఎన్‌డిడిబి నివేదిక వచ్చిందన్నారు. అలాగే సిబిఐ సిట్ కూడా నెయ్యిలో కల్తీ ఉందని నిర్ధారించిందన్నారు.

# వర్సిటీలను బంధుగణంతో నింపేసి భ్రష్టుపట్టించారు

- ప్రభుత్వ బడిలోని విద్యార్థిని సొంత బిడ్డలా భావించాలన్న నారా లోకేశ్
- జీవో 117తో గత పాలకులు విద్యావ్యవస్థను కుప్పకూల్చారని ఆగ్రహం
- యూనివర్సిటీల వీసీలుగా బంధువులు, అర్హత లేనివారేనని ఆరోపణలు
- టీచర్లను వైన్ షాపుల కాపలాకు వాడిన దుస్థితి గతానిది అంటూ విమర్శలు
- త్వరలో మెగా డీఎస్సీ తరహాలో అధ్యాపక పోస్టుల భర్తీ చేస్తామని ప్రకటన

**అమరావతి- సూర్య వాస్తవం**

ఆంధ్రప్రదేశ్ విద్యావ్యవస్థను దేశానికే ఆదర్శంగా నిలిపేలా 'ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్'ను ప్రపంచానికి చాటుదామని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. శాసనసభలో విద్యాశాఖ బడ్జెట్ డిమాండ్ల ప్రతిపాదనల సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో విద్యారంగంలో జరిగిన విధ్వంసం, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలను సవివరంగా వెల్లడించారు. రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులందరూ ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకుని, వాటి బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

**గత పాలనలో విధ్వంసం - విద్యావ్యవస్థ కుదేలు**

గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో విద్యాశాఖలో కోలుకోలేని విధ్వంసం జరిగిందని లోకేశ్ తీవ్ర విమర్శలు చేశారు. అనాలోచితంగా తీసుకొచ్చిన జీవో 117 వల్ల ప్రభుత్వ పాఠశాలలు తీవ్రంగా నష్టపోయాయని, వ్యవస్థ మొత్తం కుప్పకూలిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఐదేళ్లలో ఏకంగా 10 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారని గణాంకాలతో సహా వివరించారు. డ్రాప్ బాక్సుల విధానాన్ని దుర్వినియోగం చేసి, సుమారు 3 లక్షల మంది పిల్లల పేర్లతో మధ్యాహ్న భోజనం, కిట్ల నిధులను డ్రా చేసుకున్నారని ఆరోపించారు. కేవలం నంబర్లను మేనేజ్ చేయడానికే గత పాలకులు పరిమితమయ్యారని మండిపడ్డారు.

**అధఃపాతాళానికి పడిపోయిన ప్రమాణాలు**

గత ప్రభుత్వ చర్యల వల్ల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు (లెర్నింగ్ అవుట్ కమ్స్) దారుణంగా పడిపోయాయని మంత్రి తెలిపారు. 2018లో 5వ తరగతి పిల్లలు గ్రేడ్-2 తెలుగును 57 శాతం మంది అర్థం చేసుకోగలిగితే, గత ప్రభుత్వంలో అది 37 శాతానికి పడిపోయిందన్నారు. నేషనల్ ఎచీవ్ మెంట్ సర్వేలో 3వ తరగతి లాంగ్వేజ్ విభాగంలో ఏపీ 1వ ర్యాంకు నుంచి 27వ ర్యాంకుకు, మ్యాథ్స్ లో 5వ ర్యాంకు నుంచి 21వ ర్యాంకుకు పడిపోవడం గత పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఉపాధ్యాయులను వైన్ షాపుల వద్ద కాపలాకు పెట్టి అవమానించారని, ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేదని లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

**యూనివర్సిటీల్లో బంధుగణం - అక్రమ నియామకాలు**



విశ్వవిద్యాలయాలను గత ప్రభుత్వం రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చిందని మంత్రి ధ్వజమెత్తారు. వర్సిటీల్లో ఫ్యాకల్టీ నియామకాలను గాలికొదిలేసి, వీసీలుగా బంధువులను, అర్హత లేనివారిని నియమించి భ్రష్టుపట్టించారని విమర్శించారు. ఏయూ వీసీగా ప్రసాదరెడ్డిని నియమించి విద్యార్థులను రోడ్లపై నిలబెట్టారని, అర్హత లేకపోయినా మాజీ సీఎం బంధువు సుందరవల్లిని ఎస్వీయూ రెక్టార్ గా, విక్రమ సింహపురి వర్సిటీ వీసీగా నియమించారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా శ్రీకాంత్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, సురేంద్రనాథ్ రెడ్డి వంటి బంధువర్గానికి పదవులు కట్టబెట్టారని పేర్లతో సహా బయటపెట్టారు. వర్సిటీల్లో విగ్రహాలు పెట్టి, ఫ్లెక్సీలు కట్టి పవిత్రతను దెబ్బతీశారన్నారు. అంతేకాకుండా రూ.4 వేల కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు పెట్టి వెళ్లిపోయారని తెలిపారు.

**సంస్కరణల బాటలో ప్రజాప్రభుత్వం**

కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యాశాఖలో ప్రక్షాళన మొదలైందని లోకేశ్ తెలిపారు. జీవో 117 రద్దు చేసి, సింగిల్ టీచర్ విధానానికి స్వస్తి పలికామన్నారు. కేవలం 150 రోజుల్లోనే మెగా డీఎస్సీ నిర్వహించి 16 వేల పోస్టుల భర్తీ చేపట్టామని గుర్తుచేశారు. మరోవైపు యూనివర్సిటీల్లోని న్యాయపరమైన చిక్కులను 90 రోజుల్లో తొలగించి, త్వరలోనే అధ్యాపక పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇస్తామని ప్రకటించారు. స్కూల్ కిట్స్, చిక్కీ, గుడ్ల సరఫరాలో అవినీతిని అరికట్టి రూ.1,000 కోట్లు ఆదా చేస్తున్నామని, ఈ నిధులను విద్యార్థుల సంక్షేమమేకే వెచ్చిస్తామని స్పష్టం చేశారు.

**ఎమ్మెల్యేలకు పిలుపు - టెక్నాలజీ వినియోగం**

ప్రతి ఎమ్మెల్యే తమ పరిధిలోని రెండు పాఠశాలలను దత్తత తీసుకోవాలని, ప్రతి వారం స్కూళ్లను సందర్శించి ఫీడ్ బ్యాక్ ఇవ్వాలని మంత్రి కోరారు. పిల్లల్లో 'పాసివ్ లెర్నింగ్' నుంచి 'యాక్టివ్ లెర్నింగ్' వైపు మార్పు తెచ్చేందుకు 'క్లిక్కర్ టెక్నాలజీ'ని ప్రవేశపెడుతున్నట్లు వెల్లడించారు.

అమరావతిలో ప్రపంచస్థాయి సెంట్రల్ లైబ్రరీని ఏర్పాటు చేస్తున్నామని, ఇందుకోసం శోభా రియాలిటీ సంస్థ రూ.100 కోట్లు విరాళం అందించిందని సభకు తెలిపారు. చాగంటి కోటేశ్వరరావు గారి సలహాలతో పిల్లల్లో నైతిక విలువలు పెంచేలా చర్యలు తీసుకుంటున్నామని, అందరం కలిసి ఏపీని విద్యాహబ్‌గా మారుద్దామని మంత్రి లోకేశ్ ఆకాంక్షించారు.

# సంపాదకీయం

## 400 కోట్ల బంగారం ఎక్కడ







పోలీసుల ఎదుట కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌తో మావోయిస్టు పార్టీ కుదెలైపోయింది. ఇప్పటికే వందలాది మంది మావోలు మృత్యువాత పడగా, పలువురు అగ్రనేతలు పోలీసులు ఎదుట లొంగిపోయారు. దేవ్‌జీ, మల్ల రాజిరెడ్డి, మల్లోజుల వేణుగోపాల్, ఆశన్న, నరసింహారెడ్డి వంటి అగ్రనేతలంతా లొంగిపోవడంతో ఇక ఆ పార్టీ దేశంలో కనుమరుగవ్వడం ఖాయమనే ప్రచారం సాగుతోంది. ఈ క్రమంలో వారు పార్టీ కోసం సేకరించిన డబ్బు, నగలు ఎక్కడున్నాయనే విషయంలో పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది. కేవలం డబ్బు, బంగారమే కాకుండా మావోయిస్టులకు సంబంధించిన పలు విలువైన డ్యాక్యుమెంట్లు, ఆధునిక ఆయుధాలు అడవుల్లో రహస్య ప్రదేశాల్లో దాచి ఉంచినట్లు ప్రచారం సాగుతోంది. వాటి వివరాలను సేకరించడం కోసం కేంద్ర దర్యాప్తు సంస్థలు మావోయిస్టు పార్టీ అగ్రనేతలను తీవ్రంగా ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. మావోయిస్టుల్లో అగ్రనేతలుగా ఉన్నవారంతా ప్రస్తుతం పోలీసుల సమక్షంలో ఉన్నారు. దీంతో పార్టీ నిధులు, నిల్వల గురించి వారికి తెలిసి ఉంటుందన్న కోణంలో విచారిస్తున్నట్లు తెలుస్తోంది. దీనికోసం కేంద్ర నిఘా సంస్థలు ఇప్పటికే హైదరాబాద్ చేరుకున్నాయి. కేంద్ర నిఘా వర్గాలకు చెందిన ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ), నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ), రిసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్ (రా), ఆర్మీ ఇంటెలిజెన్స్‌తో పాటు కేంద్ర సాయుధ బలగాలకు చెందిన సీఆర్‌పీఎఫ్, సీఐఎస్ఎఫ్ తదితర బృందాలు ఇప్పటికే వారిని పలు విషయాలపై ప్రశ్నిస్తున్నాయి. గడచిన ఆరు నెలల కాలంలో మావోయిస్టు పార్టీకి చెందిన అగ్రనేతలు ఒక్కరొక్కరుగా లొంగిపోతున్న విషయం తెలిసిందే. వారు లొంగిపోతున్న సమయంలో కొంతమది నేతలు తమ వద్ద ఉన్న ఆయుధాలు, నగదు, డబ్బు పార్టీ అధిష్టానానికి అప్పగించి వచ్చినట్లు చెబుతున్నారు. మరికొంతమంది ఆయుధాలతో లొంగిపోయినప్పటికీ పార్టీకి చెందిన నిధులు, బంగారం మాత్రం అడవుల్లో ఉన్న క్యాడర్‌కు అప్పగించి వచ్చినట్లు చెబుతున్నారు. ఇటీవల లొంగిపోయిన కేంద్ర కమిటీ సభ్యులు, పొలిట్‌బ్యూరో మెంబర్ మల్లోజుల వేణుగోపాల్ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని స్పష్టం చేశారు. తాము ఆయుధాలతో విప్లవం రాదు అని నమ్మాం కనుక తమ వద్ద ఉన్న ఆయుధాలతో లొంగిపోయామని, అయితే ఇంకా పార్టీలో ఉన్న క్యాడర్ అడవుల్లో ఉండి పోరాడేందుకు సిద్ధంగా ఉండటంతో తన వద్ద ఉన్న ఆరుకోట్ల రూపాయల నగదు, ఆరు కిలోల బంగారం పార్టీ నేతలకు అప్పగించి వచ్చినట్లు స్పష్టం చేశారు. దాన్ని భూతల్లి కడుపులోనే దాస్తామని కూడా ఆయన వెల్లడించారు. మావోయిస్టు పార్టీ వద్ద పెద్ద ఎత్తున ఆయుధాలతోపాటు వందల కోట్ల రూపాయలు, అంతకు మించి విలువైన బంగారం ఉందని నిఘా వర్గాలు భావిస్తున్నాయి.

ఇటీవలి కాలంలో మావోయిస్టు అగ్రనేతల్లో ఒకరు, పీఎల్‌జీఏ కమాండర్ అయిన బార్సేదేవాను పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే. ఆ సమయంలో తెలంగాణ చరిత్రలోనే మొదటి సారిగా మావోయిస్టు డంప్ నుంచి రూ.20 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకోవడం గమనార్హం. అలాగే 48 అత్యంత అధునాతన ఆయుధాలు పోలీసులకు మావోయిస్టులు అప్పగించారు. మావోయిస్టులు కొవిడ్ సమయంలో తమ వద్ద ఉన్న కోట్లాది రూపాయల నగదును బంగారం రూపంలోకి మార్చినట్లు తెలుస్తోంది. ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఒడిసా, ఏపీ తదితర రాష్ట్రాల్లోని కాంట్రాక్టర్లు, వ్యాపారవేత్తల నుంచి మావో యిస్టులు పార్టీ ఫండ్ సేకరించినట్లు తెలుస్తోంది. ఈ మొత్తాన్ని కేంద్ర కమిటీకి పంపిస్తుంటారు. పార్టీకి నిధుల సేకరించడానకి విస్తృత నెట్‌వర్క్ ఉందని జాతీయ విచారణ సంస్థ (ఎన్ఐఏ) ధృవీకరించింది. ఈ క్రమంలోనే సుమారు రూ.400 కోట్ల విలువైన నగదును బంగారం రూపంలోకి మార్చినట్లు తెలుస్తోంది. అయితే అది ఎవరివద్ద ఉందనేది ప్రస్తుతం సస్పెన్స్..ఇక బీజాపూర్ పోలీసులు మూల్‌వాసీ బచావో మంచ్ (ఎంబీఎం) సభ్యులు ఇద్దరు మావోయిస్టుకు పార్టీకి చెందిన బ్యాంకు ఖాతాలో రూ.6 లక్షలు డిపాజిట్ చేస్తుండగా అరెస్టు చేశారు. మజ్దూర్ సంఘటన సమితి (ఎంఎస్ ఎస్) సభ్యులు కొందరు నిధులు సేకరించి, బ్యాంకుల్లో డిపాజిట్లు చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. గతంలో మావోయిస్టు స్పెషల్ ఏరియా కమిటీ సభ్యుడైన ప్రద్యుమ్నశర్మ బంధువు ఒకరు చెన్నైలోని వైద్య కళాశాలలో చేరగా, ఆమె ఫీజుకు కావాల్సిన కోటి 13 లక్షలను బ్యాంకు ఖాతాల ద్వారా ఇచ్చినట్లు ఎన్ఐఏ గుర్తించడం సంచలనంగా మారింది. పార్టీ సానుభూతి పరుల వద్దే ఇంత సొమ్ము ఉంటే ఇంకా పార్టీ డంపులలో ఎంత మేరకు ఉంటుందన్న చర్చ సాగుతోంది. మావోయిస్టు పార్టీ నోట్ల మార్పిడి సమయంలో తీవ్రంగా నష్టపోయినట్లు పార్టీ అగ్రనేతలు చెబుతున్నారు. సుమారు రూ.200 కోట్ల వరకు పాత నోట్లను మార్పిడి చేసేందుకు పార్టీ అగ్రనాయకత్వం ప్రయత్నించినట్లు తెలుస్తోంది.ఈ క్రమంలో కొంతమొత్తాన్ని మార్చినప్పటికీ మిగతది సాధ్యం కాలేదని చెబుతున్నారు. నోట్ల మార్పిడి కోసం పార్టీ సానుభూతిపరులు, ఇతర వర్గాల వారికి పార్టీ నగదును అప్పగించగా వారు డబ్బును మార్చినప్పటికీ తిరిగి పార్టీకి ఇవ్వలేదన్న ప్రచారం ఉంది. దీన్ని అగ్రనేత ఒకరు ధృవీకరించారు కూడా. అలా పెద్దమొత్తంలో పార్టీ ఆర్థికంగా నష్టపోయినట్లు నేతలు చెబుతున్నారు. మావోయిస్టు పార్టీ వద్ద సుమారు 400 కిలోల బంగారం ఉండి ఉంటుందని దర్యాప్తు సంస్థలు అనుమానిస్తున్నాయి. అయితే దాన్ని ఎక్కడ దాచారనేది ప్రస్తుతం చర్చనీయంశంగా మారింది. బంగారాన్ని అంతా అడవుల్లోని డంపు ల్లో దాచి ఉండటారని కేంద్ర, రాష్ట్ర నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. దాదాపు రూ.500 కోట్ల బంగారం మావోయిస్టు పార్టీ వద్ద ఉందనే అనుమానంతో ఆయా సంస్థలు మావోయిస్టులను ప్రశ్నిస్తున్నాయి. అయితే పార్టీ అగ్రనేతలు పార్టీ నిలువుల గురించి నోరు తెరుస్తారా? లేదా అనేది ప్రస్తుతం మిలియన్ డాలర్ల ప్రశ్న.

# హైదరాబాద్‌లో ఖమేనీ రోడ్






**హైదరాబాద్ – సూర్య వాస్తవం**

ఇప్పుడు ఎక్కడ చూసినా, ఎక్కడ విన్నా యుద్ధం గురించే చర్చ. ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా యుద్ధ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు ఉద్ధృతమవుతున్నాయి. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దాడుల నేపథ్యంలో ఒక పేరు మాత్రం పెను సంచలనం సృష్టిస్తోంది. అదే ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ పేరు. ఇటీవలి దాడుల్లో ఖమేనీ మృతి చెందడంతో యుద్ధం మరింత తారాస్థాయికి చేరుకుంది. ఇక్కడ మరింత ఆశ్చర్యపోయే విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఖమేనీ పేరు మీద హైదరాబాద్ మహా నగరంలో ఏకంగా ఓ రోడ్డే ఉందట. ఏంటి.. వినడానికి చాలా వింతగా ఉంది కదూ..!ఇరాన్ దాడుల నేపథ్యంలో అల్లకల్లోలమైన ప్రపంచ దేశాలను ఇప్పుడీ విషయం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. భాగ్యనగరంలో 'ఖమేనీ' రోడ్డు ఉందన్న విషయం తాజా దాడుల నేపథ్యంలో కొత్తగా బయటికి వచ్చింది. అయతొల్లా అలీ ఖమేనీ మరణ వార్త ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తుండగా.. మరోవైపు, హైదరాబాద్ నగరంలో ఖమేనీ పేరుతో ఒక రోడ్డు ఉందన్న విషయం సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీసింది. అది కూడా నగరంలోనే ప్రముఖంగా వినిపించే బంజారాహిల్స్‌లో ఈ పేరుతో రోడ్డు ఉండటం విశేషం. ఇక్కడే మరో ట్విస్ట్ వెలుగులోకి వచ్చింది. అయతొల్లా అలీ ఖమేనీ పేరు మీద నగరంలో రోడ్డు ఉందన్న విషయం వైరల్ అవుతున్న నేపథ్యంలో ప్రస్తుతం మరణించిన నేత పేరుతో కాకుండా ఇరాన్ తొలి సుప్రీం లీడర్ జ్ఞాపకార్థమే ఈ రోడ్డుకు ఈ పేరు పెట్టారని అసలు విషయం బయటపడింది. ఈ విషయం మాకు ఇప్పటివరకూ తెలియదని, ఖమేనీ మరణం తర్వాతే ఇలాంటి ఆశ్చర్యం కలిగించే కొత్త విషయాలు బయటికి వస్తున్నాయని నెటిజన్లు అంటున్నారు.హైదరాబాద్ నగరంలో ఈ రోడ్డు ఎక్కడ ఉందనే కదా ఇప్పుడు మీ అనుమానం..! జీవీకే వన్ మాల్ ఎదురుగా ఉండే బంజారాహిల్స్ రోడ్డు నెం.7ని అధికారికంగా 'ఇమామ్ ఖమేనీ రోడ్' అని పిలుస్తారు. ఇదే ప్రాంతంలో ఇరాన్ కాన్సులేట్ కార్యాలయం ఉండటంతో అప్పటి మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైదరాబాద్ ఈ రోడ్డుకు ఈ పేరును పెట్టినట్లు సమాచారం. కుతుబ్ షాహీల కాలం నుంచి హైదరాబాద్, ఇరాన్ దేశాల మధ్య ఉన్న ధృడమైన సాంస్కృతిక, వాణిజ్య సంబంధాలకు గుర్తుగా అప్పటి అధికారులు ఈ నిర్ణయం తీసుకోవడమే కాకుండా అప్పటి ప్రభుత్వం ఈ పేరును అధికారికంగా రికార్డుల్లో కూడా చేర్చింది.ఇరాన్ మొదటి సుప్రీం లీడర్ రుహ్వల్లా ఖమేనీ పూర్వీకులకు మన దేశంతో విడదీయలేని సంబంధాలు ఉండేవి. ఖమేనీ తాతలు ఉత్తరప్రదేశ్‌లోని బారాబంకి జిల్లాకు చెందిన కింతూరులో పుట్టారని చరిత్రకారులు చెబుతున్న మాట. 19వ శతాబ్దంలోనే ఖమేనీ పూర్వీకులు ఇరాన్‌కు వలస వెళ్లి అక్కడే రాజకీయాల్లో కీలక పాత్ర పోషించడంతో ఈ సంబంధం ఇలా కొనసాగింది. అయితే.. తాజా దాడుల ఘటనలో అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మృతి చెందాడు. డౌన్‌టౌన్‌లోని ఖమేనీ కాంపౌండ్ లక్ష్యంగా ఫిబ్రవరి 28న ఖమేనీతో పాటు ఆయన కుమార్తె, అల్లుడు, కోడలు, మనవరాలు ప్రాణాలు కోల్పోయారు. ఖమేనీ ఇరాన్ మరింత అట్టుడికిపోయింది. తమ దేశంపై దాడి చేసిన ఇజ్రాయెల్, అమెరికాలను వదిలే ప్రసక్తే లేదని ప్రకటన కూడా విడుదల చేసింది. ఈ క్రమంలో శత్రుదేశాల మధ్య పోరు మరింత తీవ్ర రూపం దాల్చింది. ఇదంతా ఇలా ఉండగా.. ఖమేనీ మరణం తర్వాత హైదరాబాద్ నగరంలో ఓ రోడ్డు ఉందనే విషయాన్ని ఓ నెటిజన్ తన ఫేస్‌బుక్ పేజీ ద్వారా వెల్లడించడంతో ఇక టి నుంచి సోషల్ మీడియాలో ఈ వార్త తెగ వైరల్ అవుతోంది.

# ఉగాదికి ఏం జరగుతుంది...



**విజయవాడ – సూర్య వాస్తవం**

ఏపీలో కూటమి ప్రభుత్వం కొత్త నిర్ణయాలు దిశగా అడుగులు వేస్తోంది. అధికారంలోకి వచ్చి రెండేళ్ల తరుణంలో సమూల మార్పులు తీసుకురావాలని భావిస్తోంది. ముఖ్యంగా పాలనలో విప్లవాత్మక మార్పులు ప్రారంభించాలని చూస్తోంది. అందులో భాగంగా ఒక కొత్త మంత్రిత్వ శాఖను తెరపైకి తెస్తోంది. సైన్స్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ అనే కొత్త శాఖ రానున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ శాఖ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దగ్గరే ఉంది. అయితే దీని పేరిట ప్రత్యేక శాఖను ఏర్పాటు చేసి ఒక మంత్రికి బాధ్యతలు కట్టబెట్టె అవకాశం ఉంది. అయితే ఈ ఒక్క శాఖ కోసం మంత్రివర్గ విస్తరణ చేపడతారా? లేకుంటే భారీ ప్రక్షాళన దిశగా అడుగులు వేస్తారా? అన్నది తెలియాల్సి ఉంది. రేపు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భేటీ ఉంది. ఈ సమావేశంలో మంత్రివర్గ విస్తరణకు సంబంధించి కీలక నిర్ణయం దిశగా అడుగులు వేసే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి ఉగాది నాటికి మంత్రివర్గ విస్తరణ ఉంటుందన్న ప్రచారం నడుస్తోంది. ప్రస్తుతం ఏపీ అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయి. మార్చి 7 వరకు కొనసాగనున్నాయి. తరువాత మంత్రి వర్గ విస్తరణ పై ఒక క్లారిటీ రానుంది. కానీ అసెంబ్లీ లాబీలతో పాటు ఎమ్మెల్యేలు ఒకచోటకు చేరే క్రమంలో దీనిపైనే చర్చ నడుస్తోంది. ప్రముఖంగా ఓ ఐదుగురు పేర్లు వినిపిస్తున్నాయి. అయితే సమూల ప్రక్షాళన ఉంటుందన్న ప్రచారం మాత్రం నడుస్తోంది. టిడిపి నుంచి చాలామంది మంత్రులను తొలగించి కొత్త వారికి అవకాశం ఇస్తారని తెలుస్తోంది. అయితే ఇప్పటికే మెగా బ్రదర్ నాగబాబుకు మంత్రి పదవి ఖాయమని ఏనాడో తేలిపోయింది. అయితే కొత్తగా ఏర్పాటు చేసే సైన్స్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ శాఖను ఆయనకు అప్పగించే అవకాశం ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ సమావేశం రాజకీయంగా ఆసక్తికరంగా మారింది. హోలీ రోజున ఈ ఇద్దరు లంచ్ మీటింగ్ ఏర్పాటు చేసుకోవడానికి గల కారణాలపై అనేక రకాలుగా చర్చ జరుగుతుంది. కేవలం నామినేటెడ్ పోస్టులు, పాలనాపరమైన విషయాలపై చర్చించడానికి ఈ భేటీ జరిగిందని ఎవరూ అనుకోవడం లేదు. బలమైన కారణం ఉంటుందనే భావిస్తున్నారు. తిరుమల లడ్డూ వ్యవహారం ప్రధానంగా కూటమి ప్రభుత్వానికి ఇబ్బంది గా మారిందని సొంత పార్టీ నేతలే అభిప్రాయ పడుతున్నారు. అనవసరంగా లడ్డూను పొడిగించి దానిని తెగే వరకూ టీడీపీ నాయకత్వమే లాగుతున్నారని సొంత పార్టీ నేతల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.దీనికి తోడు తాజాగా తిరుమలకు సంబంధించిన అనేక విషయాలు సోషల్ మీడియాలో నెట్టింట్ కనిపించడం, దానిపై ఎవరూ ఎటువంటి ప్రకటన చేయకపోవడంతో అది కూడా తమ ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తుందని భావిస్తున్నారు. అందుకోసమే ప్రధానంగా ఈ సమావేశం జరుగుతుందని తెలిసింది. ప్రభుత్వాన్ని బద్నాం చేయడానికి అనేక రకాలుగా ప్రయత్నాలు చేస్తారని, ప్రజల్లోకి మాత్రం కూటమి ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతుందన్న అభిప్రాయం కూడా నేతల్లో కలుగుతుంది. అనవసరంగా రాద్ధాంతం చేయకుండా దీనికి ఫుల్ స్టాప్ ఎలా పెట్టాలి? ఎండ్ కు ఎలా తీసు కెళ్లాలన్న దానిపైనే చంద్రబాబు, పవన్ కల్యాణ్ ల మధ్య చర్చ జరిగే అవకాశముందని పార్టీ నేతలు చెబుతు న్నారు. కూటమిలోని టీడీపీ, జనసేన ప్రజాప్రతినిధులు చాలా జాగ్రత్తగా ఉండాలని, ప్రధానంగా వివాహేతర సంబంధాల విషయాలు కూటమి ప్రభుత్వాన్ని ఇబ్బం ది కరంగా మారాయి. ఇటీవల రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌ను లక్ష్యంగా చేసుకోవడంతో పాటు తాజాగా మరొక దేవస్థానం కమిటీ ఛైర్మన్ పై కూడా ఆరోపణలు చేయడం పార్టీ ప్రతిష్ట మంటగలు స్తుందని, ఇటువంటి విషయాలు ప్రజల్లోకి వేగంగా, తొందరగా చొచ్చుకు వెళ తాయని అందుకే దీనిపై ఎలా ముందుకు వెళ్లాలన్న దానిపై పవన్, చంద్రబాబు నాయుడులు చర్చించినట్లు సమాచారం. అయితే యాక్షన్ తీసుకుంటే ఎలా ఉం టుంది? తీసుకోకుండా దీనిపై ఎలా ముందుకు వెళ్లా లన్న దానిపై కూడా చర్చ నడిచినట్లు విశ్వసనీయ సమా చారం. కూటమిలో బీజేపీ నేతల జోలికి వెళ్లే ధైర్యం లేక, జనసేన, టీడీపీ నేతలనే వైసీపీ లక్ష్యంగా చేసుకుందన్న అభిప్రాయం కూడా ఈ భేటీలో వ్యక్తమైనట్లు తెలిసింది.

# జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు




**ఉరవకొండ – సూర్య వాస్తవం :** ఉరవకొండ మండల పరిధిలో వాల్మీకి కళ్యాణ మండపంలో జనసేన నాయకులు పసుపులేటి హరిప్రసాద్, జిల్లా నాయకులు, ఉరవకొండ జనసేన ఇంచార్జ్ గౌతమ్ కుమార్, చంద్రశేఖర్ పర్యవేక్షణలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌతమ్ కుమార్ మాట్లాడుతూ జనసేన పార్టీ సభ్యత్వాలు కుటుంబానికి అండగా నిలుస్తాయని ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే పార్టీ అన్ని విధాలుగా ఆదుకుంటుందని తెలపడం జరిగింది. అందరూ కూడా ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ గతంలో ఉరవకొండ నియోజకవర్గం లో 1300 పై చిలుకు జనసేన పార్టీ సభ్యత్వాలు చేయడం జరిగిందని ఈసారి మూడువేల సభ్యత్వాలకు పైగా చేస్తామని తెలపడం జరిగింది. అలాగే కూటమి ప్రభుత్వంలో భాగంగా ఉన్నటువంటి జనసేన పార్టీ ఇప్పటికి కూడా ఎటువంటి లబ్ధిని పొందడం లేదని ఆయన జిల్లా నాయకులకు అలాగే పసుపులేటి హరి ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ఇదే అంశం గురించి జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ గారి దృష్టికి కూడా తీసుకెళ్లమని రాష్ట్ర వ్యాప్తంగా ఇదే సమస్య జనసేన నాయకులు ఎదుర్కొంటున్నారని తెలపడం జరిగింది. ఉరవకొండ నియోజకవర్గంలోని జనసేన పార్టీ మండల అధ్యక్షులు గోపాల్ నాగేష్ సుధీర్, జనసేన పార్టీ సీనియర్ నాయకులు దేవేంద్ర రాజేష్ రమేష్ మల్లికార్జున తిలక్ బోగేష్ మణికుమార్ అనిల్ రఘు వంశీ అభి ధనుంజయ, కార్యకర్తలు పాల్గొన్నారు. పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షులు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలని, సభ్యత్వ ఉప యోగాలని పవన్ కళ్యాణ్ చొరవతో గ్రామాలలో వేస్తున్న రోడ్లును, అభివృద్ధిని, సామాన్య ప్రజలకి వివరించాలని అన్నారు. నాయకుల మధ్య ఏవైనా సమస్యలుంటే ఉంటే అవి మరిచి అందరూ కలిసి సమన్వయంతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వివరించారు. కూటమిలో ఏవైనా సమస్యలుంటే పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెస్తానని అన్నారు.

## ఘనంగా టిడిపి మండల కన్వీనర్
## రామముని రెడ్డి జన్మదిన వేడుకలు



**వేంపల్లె - సూర్య వాస్తవం :** స్థానిక పట్టణంలోని ప్యారడైజ్ కేఫ్‌లో టిడిపి మండల కన్వీనర్ రామముని రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గగుటూరి ఇస్మాయిల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రామముని రెడ్డిని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేశారు. అనంతరం ఆయన కేక్ కట్ చేసి అక్కడి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆనందంగా వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా రామముని రెడ్డి మాట్లాడుతూ, తనపై చూపుతున్న అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత కృషి చేస్తానని తెలిపారు. పలువురు నాయకులు ఆయన సేవలను అభినందిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మహమ్మద్, వేమకుమార్, ఫయాజ్, తెలంగాణ వలి, దక్కా రమేష్, వెంకటరామి రెడ్డి, బాలకృష్ణారెడ్డి, అంజి, పాపిరెడ్డి, శివ, రమణ, సుబ్బయ్య, షఫీ, షేక్ సంధాని, రామాంజనేయులు, చరణ్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

## పులివెందుల మార్కెట్ యార్డ్‌కు సరికొత్త రికార్డ్

### - ఆదాయంలో జిల్లాలోనే నంబర్ వన్



**పులివెందుల - సూర్య వాస్తవం :** గత చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పులివెందుల మార్కెట్ యార్డ్ ఆదాయ లక్ష్యంలో సరికొత్త రికార్డు సృష్టించిందని గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న లక్ష్యాలను అధిగమించి, ఈ ఏడాది రూ. 108.15 లక్షల ఆదాయాన్ని సమకూర్చుకుని జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని పులివెందుల మార్కెట్ యార్డ్ ఛైర్మన్ గడ్డం అమర్నాథ్ తెలిపారు. కేవలం పాస్ మార్కులతో కాదు, డిస్టింక్షన్‌తో లక్ష్యాన్ని చేరుకున్నాం"అని ఛైర్మన్ గడ్డం అమర్నాథ్ సంతోషం వ్యక్తం చేశారు. నియోజకవర్గ ఇంచార్జ్ బీటెక్ రవి ప్రోత్సాహం మరియు పర్యవేక్షణ వల్లే ఈ ఘనత సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. చెక్ పోస్టులు, ఇతర మార్గాల ద్వారా ఆదాయాన్ని పెంచడంలో సిబ్బంది కృషిని అభినందించారు. ఈ విజయంలో సహకరించిన జిల్లా కలెక్టర్, మార్కెటింగ్ అధికారులు మరియు మార్కెట్ యార్డ్ కమిటీ సభ్యులకు ఛైర్మన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## రోడ్డు భద్రతపై ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు



**వేంపల్లె - సూర్య వాస్తవం :** జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక పట్టణంలో రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక చర్యలు చేపట్టారని సీఐ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ టి.నరసింహులు ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడపడం, అతివేగంగా ప్రయాణించడం, ప్రయాణికులను ఓవర్‌లోడ్ చేయడం వంటి చర్యలు ప్రమాదాలకు దారితీస్తాయని ఆయన హెచ్చరించారు. విధి నిర్వహణలో యూనిఫాం తప్పనిసరిగా ధరించాలని సూచించారు. రోడ్డు భద్రత నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రతి డ్రైవర్‌పై ఉందని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, పలువురు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



## అంగన్వాడీ మహిళల పట్ల
# ప్రభుత్వ తీరు అమానుషం

### - డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లె - సూర్య వాస్తవం :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడు విజయవాడ ధర్నా చౌక్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న అంగన్వాడీ మహిళలపై కూటమి ప్రభుత్వం ప్రవర్తించిన తీరు అమానుషం, అమానవీయం, ఆటవికం, అనాగరికమని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా ఛైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి విరుచుకుపడ్డారు. తెల్లవారుజామున నాలుగున్నర గంటల సమయంలో మగ పోలీసులు వచ్చి శిబిరాన్ని ధ్వంసం చేయడం శోచనీయమన్నారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ రాష్ట్ర అధ్యక్షురాలు బేబీ రాణి ఎడమ చేయి విరగడం, మరికొందరు గాయాలపాలు కావడం, బ్యాగులు, సెల్ఫోన్లో పోగొట్టుకోవడం దురదృష్టకరమన్నారు. దాదాపు 1000 మంది అంగన్వాడీ మహిళలను అరెస్ట్ చేశారు అన్నారు. ఎన్నికలకు ముందు కూటమి పార్టీలు ఇచ్చిన హామీలను అమలు చేయమని మాత్రమే అంగన్వాడీ మహిళలు అడుగుతున్నారు. కనీస వేతనాలు నెలకు రు 26000 ఇవ్వాలని, పదవి విరమణ తర్వాత గ్రాచ్యూటీ ఇవ్వాలని, మినీ అంగన్వాడీ సెంటర్లను మెయిన్ అంగన్వాడీ సెంట్రల్ గా మార్చాలని, ఖాళీగా ఉన్న 164 సూపర్వైజర్ పోస్టులను భర్తీ చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను తమకు కూడా అమలు చేయాలని అంగన్వాడీ మహిళలు చేస్తున్న డిమాండ్లు సహేతుకమైనవి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించి అంగన్వాడీ మహిళల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని, అరెస్టు చేసిన వారందరినీ విడుదల చేయాలని, కేసులు పెట్టవద్దని తులసి రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

**అగ్రిగోల్డ్ బాధితులు**

అగ్రిగోల్డ్ యాజమాన్య బాధితుల సమస్యలపై కూటమి ప్రభుత్వం వెంటనే దృష్టి సారించాలని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఇప్పటివరకు 10 లక్షల 43 వేల మంది అగ్రిగోల్డ్ ఖాతాదారులకు ప్రభుత్వం రు 906 కోట్లు ఇచ్చింది. ఇంకా 9. 50 లక్షల మంది ఖాతాదారులకు 3080 కోట్ల రూపాయలు ఇవ్వాల్సి ఉంది.

అగ్రిగోల్డ్ ఆస్తులు దాదాపు రు 24 వేల కోట్ల వరకు ఉంటాయి. చట్టపరంగా అగ్రిగోల్డ్ ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని తొమ్మిదిన్నర లక్షల మంది ఖాతాదారులకు 3080 కోట్ల రూపాయలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వానికి తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## అనాధ పిల్లల ఆశ్రయానికి
# అడ్డంకులు సృష్టించడం సరికాదు

**- రహదారి అవసరాలకు అంగీకరిస్తాం గాని మొత్తం భూమి అంటే ప్రతిఘటిస్తాం**
**- దారుల్ ఉలూమ్ తన్విరుల్ హుదా ట్రస్ట్ సభ్యులు**



**పులివెందుల రూరల్ - సూర్య వాస్తవం :** అనాధ పిల్లలకు ఆశ్రయాన్ని కల్పిస్తూ ధార్మిక విద్యను అందించే మదరసాను రహదారి అభివృద్ధి పనుల నిమిత్తం పూర్తిస్థాయిలో ప్రభుత్వం స్వాధీనపరచుకునే చర్యలను స్వాగతించబోమని ప్రతిఘటించి తీరుతామని దారుల్ ఉలూమ్ తన్విరుల్ హుదా ట్రస్ట్ పెద్దలు పేర్కొన్నారు. పులివెందుల నియోజవర్గ పరిధిలోని వేల్పుల గ్రామానికి సమీపంలో ఉన్న దారుల్ ఉలూమ్ తన్విరుల్ హుదా ట్రస్ట్ ప్రాంతాన్ని విజయవాడ నుండి బెంగళూరు గ్రీన్ ఫీల్డ రహదారికి అనుబంధ రింగ్ రోడ్ కు 90 ఎకరాలు భూమి కావాలని ప్రభుత్వం 2023 లో ప్రకటించడం జరిగిందని వాటిలో భాగంగా 90 ఎకరాలకు సంభందించిన రైతులు కోర్టును ఆశ్రయించి గత రెండు మూడు సంవత్సరాలనుండి కోర్టులో వాదోపవాదాలు కొనసాగుతున్నప్పటికీ ఇటీవల రహదారికి సంభందించి పనులను వేగవంతం చేస్తూ అదికారులు భూసేకరణ విషయమై దారుల్ ఉలూమ్ తన్విరుల్ హుదా ట్రస్ట్ (మదరసా) పరిసరాలకు వచ్చిన అదికారులకు పలు ముస్లీమ్ పెద్దలు ట్రస్ట్ కమిటీ పెద్దలు మరియు రైతు సోదరులు అధికారుల చర్యలను నిరసిస్తూ అడ్డుకోవడం జరిగిందని పెద్దలు పేర్కొన్నారు. ఈ విషయమై ముస్లిం నాయకుడు నూరుల్లా మాట్లాడుతూ గతంలో అధికారులు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా ఎలా సర్వే చేస్తారని, రోడ్డు కాలసిన భూమి ఇవ్వటానికి అనుకూలిస్తాం కానీ మొత్తం భూమి అనవసరంగా ఇచ్చేటందుకు సిద్ధంగా లేమని గత 20 సంవత్సరముల నుంచి ఈ స్థలములో పేద అనాధ పిల్లలకు కావలసిన సదుపాయాలు చేస్తూ ధార్మిక విద్య మరియు పిల్లలకు మంచి ప్రవర్తన నేర్పిస్తూ ఇక్కడే మసీదు, మదరసా, పిల్లల వసతుల కోసం చేసుకున్న రూముల సదుపాయాలు చుట్టూ కాంపౌండ్ గోడ సీసీ రోడ్డు వదులుకోవడానికి సిద్ధంగా లేమని తెగేసి చెపారు. మా పెద్దలు, జమియత్-ఉలుమా-యె-హింద్ వారితో మాట్లాడి ఆ తర్వాత ఉన్నతాధికారులు ఆర్డిం, కలెక్టర్‌తో సంప్రదిస్తామని చెప్పారు. అందుకు అధికారులు సానుకూలంగా సహకరించి వెళ్లిపోయారు. ట్రస్ట్ పెద్దలు అధికారులకు రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పులివెందుల పట్టాను తబ్లీక్ జమాత్ అధ్యక్షులు మహబూబ్ బాషా హాఫీజ్ రఫిక్, హాఫీజ్ తయాబ్, హాఫీజ్ ఇమామ్ భాషా, హాఫీజ్ అస్లం, రెడ్డి భాష హబీబుల్లాహ్, యూనుష్, హయాత్ బాషా, లతీఫ్, బాబాఫకృద్దిన్, అన్సర్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్త జిల్లాల ప్రాతిపదికన బదిలీలు చేపట్టండి

### - మండలిలో ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి



**పులివెందుల - సూర్య వాస్తవం :** ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన కీలక అంశాన్ని లేవనెత్తారు. రాష్ట్రంలో కొత్త జిల్లాలు ఏర్పడినప్పటికీ, ఉద్యోగుల బదిలీలు ఇంకా పాత (ఉమ్మడి) జిల్లాల ప్రాతిపదికనే జరుగుతున్నాయని ఆయన సభ దృష్టికి తీసుకువచ్చారు.

**ఎమ్మెల్సీ రామగోపాల్ రెడ్డి లేవనెత్తిన ప్రధానాంశాలు**

- కొత్త జిల్లాలు ఏర్పడినప్పుడు తాత్కాలిక ప్రాతిపదికన ఉద్యోగులను కేటాయించారని, అయితే బదిలీల ప్రక్రియ మాత్రం ఇంకా పాత జిల్లాల ప్రకారమే ఉండటం వల్ల ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. భార్యాభర్తల సమస్య, ఒకరు ఒక జిల్లాలో, మరొకరు వేరే జిల్లాలో పని చేస్తూ కుటుంబాలకు దూరంగా ఉంటున్నారని, ముఖ్యంగా టీచర్లు, పంచాయతీరాజ్ ఉద్యోగులకు ఈ సమస్య ఎక్కువగా ఉందని వివరించారు. ఉద్యోగులు మనశ్శాంతితో పనిచేసినప్పుడే ప్రభుత్వ పాలన ప్రజలకు సమర్థవంతంగా అందుతుందని, అందుకే బదిలీల విధానాన్ని కొత్త జిల్లాల ప్రకారం మార్చాలని కోరారు. ఎమ్మెల్సీ అడిగిన ప్రశ్నకు గౌరవ మంత్రి స్పంది స్తూ, ప్రస్తుతం బదిలీలపై నిషేధం కొన సాగుతోందని పేర్కొన్నారు. భవిష్యత్తులో బదిలీల ప్రక్రియను ప్రారంభించినప్పుడు, ఎమ్మెల్సీ సూచించిన విధంగా ఉద్యోగులకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా, వారి సమస్యలను పరిగణనలోకి తీసుకుని తగిన నిర్ణయం తీసుకుంటామని సభలో హామీ ఇచ్చారు.


## శ్రీ అంకాలమ్మ దేవస్థానంలో
# 7న టెంకాయల వేలం



**సింహాద్రిపురం - సూర్య వాస్తవం :** సింహాద్రిపురం మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అంకాలమ్మ గూడూరు లోని శ్రీ శ్రీ శ్రీ అంకాలమ్మ దేవస్థానం పరిధిలో టెంకాయల విక్రయానికి సంబంధించి బహిరంగ వేలం మార్చి 07 తేదీన (శనివారం) సమయం ఉదయం 8:00 గంటల నుండి అంకాలమ్మ గూడూరు కళ్యాణ మండపంలో నిర్వహించ నున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు వేలం పాటకు సంబంధించిన నిబంధనలు, వివరాలను వెల్లడించారు. వేలంలో పాల్గొనదలచిన వారు ముందుగా రూ. 1,00,000 (అక్షరాలా ఒక లక్ష రూపాయలు) డిపాజిట్ చెల్లించి తమ పేరు నమోదు చేసుకోవాలని, వేలం ప్రక్రియ ముగిసిన తర్వాత ఈ మొత్తాన్ని తిరిగి చెల్లించడం జరుగుతుందన్నారు. వేలం దక్కించుకున్న వారు, తాము పాడిన మొత్తంలో సగభాగాన్ని (50%) వేలం ముగిసిన వెంటనే దేవస్థానానికి చెల్లించాలని, మిగిలిన సగం మొత్తాన్ని రాబోయే శ్రీరామనవమి పండుగ రోజున చెల్లించాల్సి ఉంటుందని భక్తుల సౌకర్యార్థం ఒక టెంకాయ, ఆకులు, వక్క, అగరబత్తుల ప్యాకెట్ ధరను రూ. 40 గా ఆలయ కమిటీ నిర్ణయించిందని అంతకంటే ఎక్కువ ధరకు విక్రయించకూడదని స్పష్టం చేశారు. మరిన్ని వివరాల కోసం, ఇతర సమాచారం కోసం ఆలయ నిర్వాహకులను 8217221753, 8919095189 ఈ క్రింది ఫోన్ నంబర్ల ద్వారా సంప్రదించవచ్చు అని అన్నారు.


# స్థానిక సమస్యలను రాజకీయ సమస్యలుగా వక్రీకరించవద్దు

## - ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



**శింగనమల - సూర్య వాస్తవం :** సింగనమల మండలం నాగులగూడెం తాండ గ్రామంలో ఇటీవల చోటు చేసు కుంటున్న కొన్ని సంఘటనలను కొంతమంది అనవసరంగా నియోజకవర్గ స్థాయి గ్రూప్ రాజకీయాలుగా చిత్రీక రించడం దురదృష్టకరం. ఈ సందర్భంగా స్పష్టంగా తెలియజేయదలచుకున్నది ఏమనగా - ఇవి ఎట్టి పరిస్థితుల్లోనూ నియోజక వర్గ గ్రూప్ వివాదాలు కావు. చాలా సంవత్సరాలుగా కొనసాగుతున్న గ్రామ స్థాయి స్థానిక విభేదాలు మాత్రమే. ఈ స్థానిక సమస్యల కారణం గా గ్రామంలో అభివృద్ధి పనులు దాదాపు ఒక సంవత్సరం పాటు నిలిచిపోయాయి. ప్రజలు అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం ఎమ్మెల్యే దృష్టికి వెళ్లిన వెంటనే, అభివృద్ధి పనులు ఇకపై ఆగకూడదని సంబంధిత అధికారులకు మరియు శాఖలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ప్రస్తుతం పోలీసు శాఖ సంబంధిత ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ, గ్రామంలో నిలిచిపోయిన అభివృద్ధి కార్యక్రమాలను మళ్లీ ప్రారంభించి నిరంతరంగా కొనసాగిస్తున్నాయి. గ్రామ ప్రజల ప్రయోజనాలే మా ప్రధాన లక్ష్యం. కొన్ని వార్తా ఛానళ్లు సరైన సమాచారం లేకుండా, వాస్తవాలను ధృవీకరించకుండా ఈ అంశాన్ని నియోజకవర్గ స్థాయి గ్రూప్ సమస్యగా ప్రచారం చేయడం పూర్తిగా తప్పు. అసలు సమస్య ఆ గ్రామంలోనే ఉందని అక్కడ ఉన్నటువంటి స్థానిక మహిళలు మా గ్రామ ప్రజల్లో ఐక్యత లేదు అని 31-01-2026 తేదీన పెన్షన్ పంపిణీకి వెళ్లినటు వంటి ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు పూల నాగరాజు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరికి నాగల గుడ్డం తండా గ్రామ మహి ళలు అభివృద్ధి కార్యక్రమాలు ఆగకుండా చేయండి అని ఒక వినతి పత్రం ఇవ్వడం జరిగింది. దానికి కొనసాగింపుగా ఎమ్మెల్యే చర్యలు తీసుకోవడం జరిగింది. అంతే గాని, గ్రామ స్థాయిలో ఎన్నో సంవత్స రాలుగా ఉన్న సమస్యలకు రాజకీయ రంగు పులమడం అనవసరం, ప్రజల్లో గందరగోళం సృష్టించే చర్య. ఇది ఎమ్మెల్యే ఆపాదించడం ముమ్మాటికి ఖండించదగ్గ విషయం. తమ నియోజకవర్గంలో ఎలాంటి గ్రూప్ రాజకీయాలు లేవని గ్రామప్రజలు అన్నారు.

# ఆర్డీటీ పరిరక్షణ కోసం 9న అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నా



**ఉరవకొండ - సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లాలో పేదలకు విద్య, వైద్యం, ఉపాధి కల్పిస్తున్న రూరల్ డెవలప్ మెంట్ ట్రస్ట్కు ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్ పునరుద్ధ రించాలని కోరుతూ ఆర్డీటీ పరిరక్షణ పేరుతో ఈ నెల 9న ఉరవకొండలో పెద్ద ఎత్తున ధర్నా చేస్తున్నట్లు అఖిలపక్షం నేతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ఆధ్వర్యంలో జరిగే ఈ ధర్నాలో మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి పాల్గొంటారని చెప్పారు. స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో వైస్సార్సీపీ నాయకులు బసవరాజు, గోవిందు, జగదీష్, సీపీఐ నేత చెన్నారాయుడు, సిపిఎం నేత రంగారెడ్డి, దళిత, విద్యార్థి సంఘాల నేతలు మీడియా సమావేశం నిర్వహించారు. ఆర్డీటి సంస్థ నిధుల కొరతతో మూతపడితే వేలాది కుటుంబాలు ఉపాధివైద్య సేవలు నిలిచిపోతాయని, కేంద్రం వెంటనే జోక్యం చేసుకుని లైసెన్స్ రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేశారు.

# మంత్రి అచ్చెన్నాయుడు రాజీనామా చేయాలి

## - సభలో అడుగుపెట్టకుండా చర్యలు తీసుకోవాలి
## - టీడీపీ నుంచి ఆయన్ను సస్పెండ్ చేయాలి
## - వైసీపీ జనరల్ సెక్రటరీ గడికోట శ్రీకాంత్ రెడ్డి డిమాండ్



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం :** రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న మండలి చైర్మన్‌కి మతం, పార్టీ ఆపాదిస్తూ మాట్లాడిన సీనియర్ మంత్రి అచ్చెన్నాయుడు తక్షణం తన పదవికి రాజీనామా చేయాలని, సభలో అడుగుపెట్టకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆయనపై చర్యలు తీసుకోవాలని వైయస్సార్సీపీ జనరల్ సెక్రటరీ గడికోట శ్రీకాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. రాజకీయ లబ్ధి కోసం ఇన్నాళ్లు దేవుడిని రాజకీయాల్లోకి లాగి ఆలయ ప్రతిష్టను మసకబార్చిన కూటమి నాయకులు.. మాట్లాడాల్సిన సబ్జెక్టుని పక్కన బెట్టి శాసనమండలి చైర్మన్‌ని చర్చలోకి లాక్కురావడమే కాకుండా ఆయన్ను కులమతాల పేరుతో కించపరచడం దారుణమని ఆయన ఆక్షేపించారు. రాజ్యాంగ వ్యవస్థలో ఈరోజును చీకటిరోజుగా చూడాలని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన జి.శ్రీకాంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రెస్‌మీట్‌లో జి.శ్రీకాంత్‌రెడ్డి ఇంకా ఏం మాట్లాడారంటే.

**మండలి ఛైర్మన్‌ను అవమానించడం దారుణం:**

కల్తీ నెయ్యి పేరుతో టీటీడీ నిధుల దోపిడీకి పాల్పడిన హెరిటేజ్ అంశం మండలిలో చర్చకు రావడంతో దానికి సమాధానం చెప్పలేక సభలో లేని వైయస్ జగన్ గారు, మండలి చైర్మన్లు క్రిస్టియన్లు అని మాట్లాడుతూ సభను పక్కదారి పట్టించే ప్రయత్నం చేయడం అత్యంత హేయమైన చర్య. పైగా మీ నాయకుడు జగన్ అంటూ మండలి చైర్మన్‌కు పార్టీని ఆపాదించి అవమానించారు. ఇది దారుణం. ఇందాపూర్ డెయిరీ ముసుగులో హెరిటేజ్ చేసిన టీటీడీ నిధుల దోపిడీపై వైయస్సార్సీపీ సభ్యులు ప్రశ్నిస్తుంటే వాటికి సమాధానం చెప్పుకోలేని ప్రభుత్వం సభను పక్కదోవ పట్టించడానికి చైర్మన్‌ని రాజకీయాల్లోకి లాగి మతాన్ని, పార్టీని ఆపాదించింది.

**అధికార పక్ష సభ్యుల అనైతిక ప్రవర్తన:**

అధికార పార్టీ సభ్యులం అన్న విషయమే మరిచిపోయి వైయస్సార్సీపీ సభ్యులు మాట్లాడు తుండగా ప్రసంగానికి పదులసార్లు అడ్డుతగలడమే కాకుండా మంత్రులంతా పోడియం చుట్టుముట్టి సభలో ఆందోళన చేయడం సిగ్గుచేటు. నేను ఫలానా మతం అని మండలి చైర్మన్ చెప్పుకునే దుస్థితి కల్పించినందుకు ప్రభుత్వం సిగ్గుపడాలి. పరిస్థితులు తమకు అనుకూలంగా లేకపోతే ఎవరి కైనా కులమతాలు అంటగట్టి దిగజారుడు రాజకీయాలు చేస్తామని కూటమి నాయకులు చెప్పకనే చెబుతున్నారు.

**అచ్చెన్నాయుడిపై చర్యలు తీసుకోవాలి:** ఇప్పటికైనా సీఎం చంద్రబాబు కలగజేసుకుని మంత్రి కె.అచ్చెన్నాయుడిని రాబోయే మూడేళ్లపాటు సభలో అడుగుపెట్టకుండా శాశ్వతంగా సభ నుంచి సస్పెండ్ చేయాలి. మంత్రి అచ్చెన్నాయుడు తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్టు ప్రకటిస్తే సరిపోదు. ఆయన తన పదవికి రాజీనామా చేయాలి. తెలుగుదేశం పార్టీ నుంచి ఆయన్ను సస్పెండ్ చేయాలి. శ్రీవారిని రాజకీయాల్లోకి లాగినందుకు కూటమిని ప్రజలు అసహ్యించుకుంటుంటే దాన్నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు కులమతాలతో రాజకీయాలు చేయడం అత్యంత హేయమైన చర్య అని జి.శ్రీకాంత్‌రెడ్డి అభివర్ణించారు.

# శనగ - కందుల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన అధికారులు



**తొండూరు - సూర్య వాస్తవం :** తొండూరు మండలంలోని శనగ మరియు కందుల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి కొనుగోలు కేంద్రంలోని తేమ శాతం చూసే మిషన్, సంచుల లభ్యత, కొనుగోలు విధానాన్ని పరిశీలించారు. అలాగే నాణ్యతా ప్రమాణాలను పాటించి రైతులకు ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని శనగ కనుగోల కేంద్రం ఇంచార్జ్ జి.గంగా ప్రసాద్ రెడ్డి, సిబ్బందికి సూచించారు. శనగలు అమ్ముతున్న రైతుల నుండి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు 2025 రబీలో జరిగిన కంది పంట షెడ్యూలింగ్ తొందరగా పూర్తి చేసి త్వరలో కందులను కొనుగోలు చేయాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కే.రాజు, గ్రామ వ్యవసాయ సహాయకుడు సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

# మొక్కజొన్న పంట పరిశీలన




**వేముల - సూర్య వాస్తవం :** పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా బుధవారం నారెపల్లి గ్రామంలో మొక్కజొన్న పంటను వ్యవసాయ అధికారి జిపి ఓబులేసు పరిశీలించారు. తదనంతరం వ్యవసాయ అధికారి జిపి ఓబులేసు మాట్లాడుతూ నారేపల్లె గ్రామంలో రామిరెడ్డి, వెంకట కృష్ణారెడ్డి అను ఇద్దరు రైతులు తమకు ఉన్నా మూడు ఎకరాల పొలంలో సంపూర్ణ మొక్కజొన్న వేయడం జరిగింది ఎకరంనకు 10 కేజీలు విత్తనాలు నడవడం జరిగింది.సంపూర్ణ లేపాక్షి మొక్క జొన్న విత్తనాలు చీడపీడలను, వర్షాభావ పరిస్థితులను తట్టుకొని అధిక దిగుబడిని ఇచ్చాయని రైతులు సంతోషాన్ని వ్యక్తపరిచారు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సురేష్, లేపాక్షి కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ ఎం సురేష్ రెడ్డి లేపాక్షి కంపెనీ సంపూర్ణ విత్తనముల డిస్ట్రిబ్యూటర్ శ్రీనివాసులు రెడ్డి కిషన్ ఆగ్రో ఏజెన్సీ మార్కెటింగ్ మేనేజర్లు శివారెడ్డి, ఏకాంత రెడ్డి విహెచ్ఎ వ్యవసాయ సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.



# శ్రీనివాసరాజుకు ఘన సన్మానం

**డోన్ - సూర్య వాస్తవం:** చిట్టూరి శ్రీనివాసరాజుకు హోస ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా వీడ్కోలు పలికారు తోటి సహచరులు. సంవత్సరాల కాలం పాటు ఉద్యోగం చేస్తూ సేవలందించిన ఉద్యోగులు పదవీ విరమణ చేసిన కాలానికి తీపి గుర్తులుగా మిగిలిపోతాయని కర్నూలు జిల్లా కోడుమూరు మండలం ఎంజిఎంజి ఆర్ఎస్ పనిచేస్తున్న చిట్టూరి శ్రీనివాసరాజు నిరంతర శ్రమయే ఆయుధంగా, నిబద్ధత, క్రమశిక్షణతో, స్నేహపూర్వకంగా మెదిలి అందరి మన్ననలను పొందారనిన్నారు. పదవి విరమణ అనేది అనివార్యమని, ప్రతిఒక్కరూ పదవీ విరమణ పొందుతారని, వారి భావిజీవితం సుఖశాంతులతో, ఆయురా రోగ్యాలతో ఉండాలని కోరారు. 31 వతేదీన పదవీ విరమణ చేసిన సి.శ్రీనివాసరాజు టెక్నికల్ అసిస్టెంట్లు అందరూ పదవి విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్య క్రమంలో న్యాయవాది నాగభూషణ్ రెడ్డి, హెడ్మాస్టర్ అన్వర్ బాషా, హోసా అధ్యక్షులు సుదర్శన్, జనరల్ సెక్రటరీ శివశంకరయ్య, స్నేహితులు, సహ విద్యార్థులు, జె.మద్దయ్య హెడ్ కానిస్టేబుల్. నబీరసూల్, ప్రసాద్ హెడ్ కానిస్టేబుల్ శివనాగయ్య, శ్రీనివాసరెడ్డి, లక్ష్మయ్య, యెల్లయ్య, శివశంకర్ రెడ్డి, విశ్వనాథరెడ్డి న్యాయవాది, సర్వజ్ఞమూర్తి గురువు, చంద్రమౌళి ఉపాధ్యాయుడు, అంజనప్ప టీచర్, వేణుగోపాల్. ప్రిన్సిపాల్, రాధాకృష్ణ, ఎం. లక్ష్మీనారాయణ గౌడ్, మురళీ ధర్, చార్లెస్, జె.దివాకర్, మహేంద్ర, జి. శ్రీరాములు, చంద్రపల్లి, నాగేశ్వర్ రావు చంద్రపల్లి ఇంకా హాజరైన అందరి పేరునా ధన్యవాదాలు, హోస జిల్లా పరిషత్ హై స్కూల్ విషేనాపురం స్టాప్ ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.





# ఇఫ్తార్ విందులో పాల్గొన్న గుమ్మనూరు ఈశ్వర్



**పామిడి - సూర్య వాస్తవం:** పామిడి పట్టణం షాదీ ఖానాలో పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదర సోదరిమనులకు పామిడి పట్టణం 11వ వార్డు ఇంచార్జ్ పఠాన్ ఖలందర్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గుంతకల్లు నియోజకవర్గం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు పామిడి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గుమ్మనూరు ఈశ్వర్ మాట్లాడుతూ రంజాన్ పవిత్ర మైన నెలలో ముస్లిం సోదర సోదరీ మణులకు విందు ఏర్పాటు చేయడం చాలా సంతోషకరంగా ఉందని ఈ కార్యక్రమం లో నేను పాల్గొని ముస్లిం సోదరులకు విందు వడ్డించడం కూడా చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పామిడి మండలం మరియు పట్టణ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఆత్మీయుల మధ్య వీరారెడ్డి జన్మదిన వేడుకలు



**పులివెందుల - సూర్య వాస్తవం:** వైయస్సార్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ ఇరికిరెడ్డి వీరారెడ్డి పుట్టినరోజు వేడుకలను ఆత్మీయుల మధ్య బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక బిఎస్ఎన్ఎల్ ఆఫీస్ వద్ద ముఖ్య అతిథులుగా నర్రాల వీరారెడ్డి డిసిసి బ్యాంక్ ఛైర్మన్ హాజరై ఆయనను శాలువతో సత్కరించారు. వీరారెడ్డి తో కలిసి కేకును కట్ చేసి అందరికీ పంచిపెట్టి వీరారెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. వైఎస్ఆర్సిపి నూరు భాష సంఘం అధ్యక్షుడు రసూలు, చేనేత సంఘం జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు చంద్రమౌళి, కౌన్సిలర్ పురుషోత్తం, సంపత్తు, శీను, బాలుడు, బాలిరెడ్డి, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# “డ్రగ్స్ వద్దు బ్రో.. దేశమే ముద్దు”

- రాయచోటిలో విద్యార్థుల ‘ఈగల్’ గర్జన!
- మత్తు పదార్థాలకు దూరంగా ఉంటేనే ఉజ్వల భవిష్యత్తు
- డీఎస్పీ కృష్ణమోహన్ పిలుపు
- అన్నమయ్య జిల్లా పోలీస్ ‘ఈగల్ సెల్’ ఆధ్వర్యంలో భారీ అవగాహన సదస్సు..




**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం:** యువత డ్రగ్స్ వంటి అలవాట్లకు దూరంగా ఉండి, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని అన్నమయ్య జిల్లా పోలీస్ యంత్రాంగం పిలుపునిచ్చింది. జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు, రాయచోటి డీఎస్పీ ఎం.ఆర్. కృష్ణమోహన్ పర్యవేక్షణలో బుధవారం మసాపేటలోని శ్రీ సాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలలో “ఈగల్ సెల్” ఆధ్వర్యంలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమం అత్యంత ఉత్సాహంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, మత్తు పదార్థాల వినియోగం ఒక వ్యక్తిని మాత్రమే కాకుండా, ఒక కుటుంబాన్ని, తద్వారా సమాజాన్ని నిర్వీర్యం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్‌డిపిఎస్ యాక్ట్ కింద డ్రగ్స్ రవాణా లేదా వినియోగం చేస్తే ఎదు రయ్యే కఠినమైన శిక్షల గురించి విద్యా ర్థులకు వివరించారు. దేశ భద్రతకు ముప్పుగా పరిణమించిన నార్కో పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని హెచ్చ రించారు. విద్యాసంస్థల పరిసరాల్లో డ్రగ్స్ రహిత వాతావరణాన్ని కల్పించేందుకు ‘ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్’ అమలు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులే స్వచ్ఛందంగా డ్రగ్స్ నియంత్రణలో భాగస్వాములు కావడానికి ‘ఈగల్ క్లబ్స్’ విశేషంగా కృషి చేస్తున్నాయని పేర్కొన్నారు. సదస్సులో పాల్గొన్న సుమారు 300 మంది విద్యార్థులు ఒకే స్వరంతో “డ్రగ్స్‌కు చెక్... ఈగల్‌తో సేఫ్!”, “దేశాన్ని ప్రేమిద్దాం – డ్రగ్స్‌ను ద్వేషిద్దాం” అంటూ నినదించడం విశేషం. అనంతరం విద్యార్థులందరితో డ్రగ్స్ తీసుకోబోమని, ఇతరులను కూడా అటువైపు వెళ్లకుండా అడ్డుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులందరి సెల్ ఫోన్లలో ఈగల్ సెల్ సోషల్ మీడియా ప్లాట్‌ఫార్మ్‌ను సబ్‌స్క్రైబ్ చేయించారు. దీని ద్వారా డ్రగ్స్ నివారణపై నిరంతరం అప్‌డేట్స్ పొందవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో రాయచోటి టౌన్ ఇన్‌స్పెక్టర్ బి.వి. చలపతి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కుళాయప్ప, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, శక్తి టీమ్ సభ్యులు, ఈగల్ టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.




# వైఎస్ జగన్‌ను కలిసిన నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి



**వెంకటగిరి – సూర్య వాస్తవం :** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని తాడేపల్లిలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వెంకటగిరి నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వెంకటగిరి నియోజకవర్గ పార్టీ పరిస్థితి, రాబోవు పట్టణ మున్సిపాలిటీ, స్థానిక సంస్థల ఎన్నికాలు, పార్టీ క్యాడర్ తదితర అంశాల గురించి మాట్లాడుకున్నట్లు తెలిసింది. నేదురుమల్లి వెంట డాక్టర్ బొలిగిలి మస్తాన్ యాదవ్ ఉన్నారు.

# ఉగాదిలోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి

## - హౌసింగ్ పీడీ శైలజ ఆదేశం



**అనంతపురం – సూర్య వాస్తవం:** ఉగాదిలోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని అనంతపురం జిల్లా హౌసింగ్ పీడీ మడిచేడు శైలజ ఆదేశించారు. బుధవారం సాయంత్రం ఆమె తన ఛాంబర్ నుంచి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. డివిజన్ల వారీగా ఇళ్లు మంజూరు, కేటాయించిన టార్గెట్ గురించి ఆరా తీశారు. ఇప్పటి వరకు ఎన్ని పూర్తయ్యాయి, ఇంకా ప్రోగ్రెస్ లో ఎన్ని ఇళ్ళు ఉన్నాయనే వివరాలు ఆరా తీశారు. ఇప్పటి వరకు జిల్లాలో కళ్యాణదుర్గం టాప్ లో ఉండగా, అనంతపురం చివరి జాబితాలో ఉన్నట్లు తెలిపారు. గుంతకల్లు డివిజన్ రెండో స్థానంలో ఉందని వివరించారు. పురోగతిలో వెనుకబడిన డివిజన్లు, మండలాల అధికారులు తమకు కేటాయించిన టార్గెట్లపై దృష్టి పెట్టి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆమె స్పష్టం చేశారు. లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ఘనంగా ఆద్య హ్యాకథాన్ 2026



**వేంపల్లె – సూర్య వాస్తవం:** ట్రిపుల్ ఐటి ఇడుపులపాయలో బుధవారం ఆద్య హ్యాకథాన్ 2026 ఘనంగా నిర్వహించారు. సి-ఎస్-ఇ డిపార్ట్మెంట్ విభాగాధిపతి డాక్టర్ రత్నకుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దాదాపు 50కి పైగా టీమ్స్ పాల్గొన్నారు. త్రిబుల్ ఐటీ నుంచే కాకుండా ఇతర విద్యా సంస్థల నుంచి కూడా విద్యార్థులు పాల్గొన్నారు. ట్రిపుల్ ఐటి డైరెక్టర్ స్వామి గుప్తా మాట్లాడుతూ విద్యార్థులు ఇటువంటి కార్యక్రమంలో ఇంకా చురుకుగా పాల్గొనాలని ప్రస్తావించారు. విద్యార్థులు తమ ఏఐ నైపుణ్యాలను పెంచుకున్నారు. ఈ హ్యాకతాన్‌లో గెలిచిన విద్యార్థులకు ఈ నగదు 12,000 రూపాయలు బహుమతిగా అందిస్తున్నారు. ఈ నగదు ప్రోత్సాహానికి సిఎస్ఇ డిపార్ట్మెంట్ పూర్వ విద్యార్థులు ప్రవీణ్ కుమార్, శివప్రసాద్ అందించారు. పూర్వ విద్యార్థుల ప్రోత్సాహాన్ని విభాగాధిపతి డా.రత్నకుమారి అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, విభాగాధిపతి డాక్టర్ రత్నకుమారి మరియు ఇతర డిపార్ట్మెంట్ అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఇంటింటికి ఆహ్లాదకరమైన వసంతం..





**వేంపల్లె – సూర్య వాస్తవం:** అన్ని దానంలో కన్నా విద్య చాలముఖ్య మైందని డిప్యూటి డైరెక్టర్ వయోజన విద్యాశాఖ వైస్సార్ కడప జిల్లా వారు తెలియజేశారు. యూఎల్ ఎల్ఏఎస్ కార్యక్రమంలో భాగంగా (అక్షరాంధ్ర) బుధవారం ఫ్రీ ఫైనల్ పరీక్ష కేంద్రాలలో మండ లంలోని పాములురు వేంపల్లి4 వ సచివాలయములో పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలను అందరూ సద్విని యోగం చేసుకొని ప్రతి రోజు చదువుకొని.,చదవడం రాయడం, నేర్చుకోవాలని స్వయం సహాయక సంఘ సబ్యులకు తెలియజేశారు. మండల అభివృద్ధి అధికారి కుళ్లాయమ్మ మాట్లాడుతూ మహిళలు అందరూ బాగా చదువు నేర్చుకొని ఇతరుల నుండి మోసాలకు గురి కాకుండా జాగ్రత్తగా ఉండాలని అలాగే బ్యాంకుల నందు నగదు లావాదేవీలను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఏపిఎం వెంకటేశ్వరరావు మాట్లాడుతు మండలంలో 3077 మంది ఎస్ హెచ్ జి సభ్యులు బుధవారం పరీక్షలు రాశారు. అందరూ బాగా చదువు నేర్చుకోవడం జరిగినది అని మహిళలు అందరూ చదువుకుంటే కుటుంబాలు అన్ని సంతోషంగా ఉంటాయని తెలియజేశారు. ఈ కార్యక్రములో సీసీలు రామలింగయ్య, అనిల్, జయలక్ష్మి, బాబు, రెడ్డయ్యరెడ్డి, సదాశివుడు, ప్రసాద్, గ్రామసమాఖ్య అసిస్టెంట్, వాలుంటేర్ టీచర్స్ పాల్గొన్నారు.




# సమగ్ర శిక్ష ఉద్యోగుల హక్కుల కోసం “చలో విజయవాడ” ఉద్యమం

**కడప – సూర్య వాస్తవం:** సమగ్ర శిక్ష విభాగంలో కాంట్రాక్ట్ ఆధారంగా పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను సమర్ధవంతంగా పరిష్కరించాలనే కోరికతో మార్చి 6న “చలో విజయవాడ” కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మైదుకూరు మండల విద్యాశాఖ అధికారులు సమగ్ర శిక్ష ఉద్యోగుల మాస్ లీవ్ మంజూరు చేయాలని వినతి పత్రం స్వీకరించారు. క్లస్టర్ రిసోర్స్ ఆ మొబైల్ టీచర్స్ (సిఆర్ఎమ్టి), కంప్యూటర్ ఆపరేటర్స్, ఎం.ఐ.ఎస్ కోఆర్డినేటర్స్, ఐ.ఆర్.టి టీచర్స్ తదితర సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొని, వారి వేతనాలు పెంపు, ఉద్యోగ భద్రత, ఆరోగ్య భద్రత, రెగ్యులర్ చేయడం, డిఎస్సి వెయిటేజ్ వంటి ముఖ్య సమస్యల పరిష్కారాన్ని రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకురావనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీ ప్రకారం ఎంటీఎస్ విధానం తక్షణమే అమలు చేయాలని, గౌరవ సుప్రీంకోర్టు తీర్పులను పరిగణలోకి తీసుకుని ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు. మాస్ లీవ్ మంజూరు చేయడం ద్వారా ఈ చలో విజయవాడ కార్యక్రమంలో ఎక్కువ మంది ఉద్యోగులు పాల్గొనగలిగారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు ఈ ఉద్యమం ద్వారా తమ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని ఆశిస్తున్నారు.

# ‘భారతదేశంలో ప్రజాస్వామ్యం ఎక్కడుందో మీకు తెలుసా’ పుస్తకావిష్కరణ



**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం:** స్థానిక రాయచోటి అంబేద్కర్ సర్కిల్ దగ్గర డిగ్రీ కాలేజీ విశ్రాంత లెక్చరర్ నెల్లిపల్లి సిద్దయ్య రచించిన భారతదేశంలో ప్రజాస్వామ్యం ఎక్కడుందో మీకు తెలుసా అనే పుస్తకాన్ని బహుజన టీచర్స్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు పల్లం రామచంద్ర రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ షేక్ అబ్దుల్ రజాక్, ఎంఆర్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి రామాంజనేయులు లాయర్ రెడ్డెయ్య బీటీఏ అన్నమయ్య జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఏవీ రమణ, ట్రెజరర్ సీవీ రమణ, జిల్లా ఉపాధ్యక్షులు తేజ లతో కలిసి ఆవిష్కరించారు. ప్రజాస్వామిక భారతదేశంలో ఓటు హక్కు ద్వారా బహుజనులు ఏకమై ఏ విధంగా అధికారంలో భాగస్వామ్యం కావాలి వనరులలో వాటాను ఎలా పొందాలో ఈ పుస్తకంలో వివరించారని ప్రతి ఒక్కరూ ఈ పుస్తకాన్ని చదివి అవగాహనా పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమం లో రఘు నాథ, శ్రీరాములు, సోనేనాయక్, మేకా రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ సమైక్యత క్యాంపులో విద్యార్థుల అత్యుత్తమ ప్రదర్శన

## - అభినందించిన కళాశాల యాజమాన్యం




**పులివెందుల – సూర్య వాస్తవం :** కర్ణాటకలోని బెల్గావిలో నిర్వహించిన జాతీయ సమైక్యత క్యాంపులో పులివెందుల డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ సందర్శన పట్ల కళాశాల యాజమాన్యం అభినందనలు తెలియజేశారు. ఫిబ్రవరి 24 నుంచి మార్చి 2 వరకు కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ సహకారంతో కర్ణాటక ప్రభుత్వం ఎన్ఎస్ఎస్ రీజినల్ డైరెక్టర్ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న కర్ణాటకలోని బెల్గావీ లో నిర్వహించే శిబిరంలో ఎన్నో సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలలో పులివెందల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థినిలు సి.గౌరీ ఎస్.ఆయిష సమైక్యత భావం పెంపులో కీలకపాత్రను పోషించి వివిధ రాష్ట్రాల యువతకు ఒకే వేదిక పై విభిన్న భాషలు సంస్కృతి సాంప్రదాయాల మధ్య పరస్పర అవగాహన పెంపుదలో తమ ప్రత్యేకతను ప్రదర్శించడం పట్ల విశేష ప్రతిభను గుర్తిస్తూ ప్రిన్సిపల్ డాక్టర్ బి.శ్రీనివాసులు వైస్ ప్రిన్సిపల్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ యు.శ్రీనిత, ఎన్.శ్రీనివాసులు రెడ్డి అధ్యాపక బృందం విద్యార్థులను యాక్చువల్‌గా నేను అభినందించారు.

# నీటి ఎద్దడి తలెత్తకుండా పర్యవేక్షణ



**గుత్తి – సూర్య వాస్తవం:** గుత్తి మున్సిపాలిటీలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అనంతపురం జి.సూర్య నారాయణ పామిడి పెన్నా నదిలో ఉన్న సత్యసాయి, వై.టి చెరువు నీటి సరఫరా పథకాలను తనిఖీ చేసి తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డి.ఈ.ఈ హేమచంద్ర, ఏ.ఈ గోవిందప్ప, మున్సిపల్ సిబ్బందితో పర్యవేక్షించారు.




# వారంరోజుల ముందుగానే 'ఉస్తాద్ భగత్‌సింగ్'!



పవన్‌కళ్యాణ్ కథానాయకుడిగా నటించిన సినిమా 'ఉస్తాద్‌భగత్‌సింగ్'. హరీష్‌శంకర్ దర్శకుడు. ఈనెల 26న థియేటర్లలోకి ఈ సినిమా రానుంది. దీనికి తగ్గట్టుగానే చిత్ర యూనిట్ ప్రచార కార్యక్రమాలను ప్రారంభించింది. మరో 20 రోజుల మాత్రమే సమయం ఉండటంతో కార్యక్రమాలను ముమ్మరం చేసింది. 'గబ్బర్‌సింగ్' కాంబో రిపీట్ చేస్తూ పవన్-హరీశ్‌శంకర్ మరోసారి ఈ సినిమా కోసం కలిసి పనిచేశారు. తొలుత 'భవదీయుడు భగత్‌సింగ్?' పేరుతో ప్రాజెక్ట్ మొదలుపెట్టారు. తమిళ మూవీ 'తెరి'కి ఇది రీమేక్ అని సోషల్‌మీడియాలో రావటంతో ఆ తర్వాత టైటిల్ 'ఉస్తాద్ భగత్‌సింగ్' అనే పేరు మార్చారు. ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ సంగీతాన్ని అందించారు. ఇప్పటికే రెండు పాటలు కూడా విడుదలైన విషయం తెలిసిందే. ఇప్పుడు బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ కోసం దేవికి బదులు తమన్ పనిచేస్తున్నాడని సమాచారం. ఈనెల 19న రావాల్సిన 'టాక్సిక్' వాయిదా పడడంతో అది ఈ సినిమాకు ఉపయోగపడేలా ఉంది. అనుకున్నట్లు ఈనెల 26న కాకుండా ఓ వారం ముందుకు జరిగి 19నే తమ సినిమాని విడుదల చేయాలని హరీష్‌శంకర్ భావిస్తున్నట్లుగా సమాచారం.

# నూతన దంపతులకు టాలీవుడ్ ఆశీర్వాదం



నూతన దంపతులైన విజరు దేవరకొండ, రష్మికల వెడ్డింగ్ రిసెప్షన్ హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ హోటల్‌లో బుధవారం ఘనంగా జరిగింది. రిసెప్షన్ పార్టీకి పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. ఇప్పటికే విజరు-రష్మిక జంట అభిమానుల కోసం ఆదివారం ఓ ప్రత్యేక విందును ఇచ్చింది. హైదరాబాద్, ముంబై, ఢిల్లీ, చెన్నై, బెంగళూరు అహ్మదాబాద్‌తో సహా అనేక ఇతర ప్రధాన కేంద్రాలతో పాటు దేశంలోని 23 నగరాల్లో వేలాది స్వీట్‌బాక్సులు పంపిణీ చేయించారు. కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్ ఇతర రాష్ట్రాల్లోని 16 దేవాలయాల్లో 'అన్నదానం' నిర్వహించారు. అంతకు ముందే తెలుగు మీడియా ప్రతినిధులతో ఈ జంట చిట్‌చాట్ నిర్వహించింది. ఈ రిసెప్షన్ వేడుకకు టాలీవుడ్‌తోపాటుగా పలు చిత్ర పరిశ్రమకుచెందిన ప్రముఖులు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.

# 'బాల్ రాజ్' పాత్రలో ..



తరుణ్ భాస్కర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'క్రేజీ కల్యాణం'. యారో సినిమాస్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెం. 2గా ప్రొడ్యూసర్ బూసమ్ జగన్ మోహన్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రానికి బద్రప్ప గాజుల దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి తరుణ్ భాస్కర్ పోషిస్తున్న 'బాల్ రాజ్' క్యారెక్టర్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. పెళ్లి చుట్టూ సాగే ఒక ఆసక్తికరమైన కథాంశంతో, పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రంగా ఈ సినిమా రూపొందుతోంది. నరేష్ వీకే, అనుపమ పరమేశ్వరన్, అఖిల్ ఉడ్డెమారి వంటి నటులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే తెలంగాణలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమాకు సురేష్ బొబ్బిలి సంగీతాన్ని అందిస్తున్నారు.



# అలెన్ విధ్వంసం



- 33బంతుల్లోనే సెంచరీతో రికార్డు పుటల్లోకి..
- టి20 ప్రపంచకప్ ఫైనల్‌కు న్యూజిలాండ్
- సెమీస్‌లో దక్షిణాఫ్రికాపై 9వికెట్ల తేడాతో గెలుపు

ఐసిసి టి20 ప్రపంచకప్ సెమీఫైనల్లో న్యూజిలాండ్ ఓపెనర్ ఫిన్ అలెన్ విధ్వంసం సృష్టించాడు. కేవలం 33బంతుల్లో అజేయ శతకంతో మెరిసి న్యూజిలాండ్‌ను ఫైనల్‌కు చేర్చాడు. ఈ క్రమంలో 33బంతుల్లో సెంచరీ కొట్టిన సికిందర్ రాజా(జింబాబ్వే), జాన్ నికోల్(నమీబియా) సరసన నిలిచాడు. ఈ క్రమంలో ఎస్టోనియా బ్యాటర్ సాహిల్ చౌహాన్ (27బంతులు), మహ్మద్ ఫహాద్(టర్కీ; 29బంతులు) సెంచరీ కొట్టిన రికార్డును బ్రేక్ చేయలేకపోయాడు.

కోల్‌కతా: దక్షిణాఫ్రికా నిర్ణయాత్మక మ్యాచుల్లో ఒత్తిడి గురై ఓటమిపాలవుతుందనే నానుడిని మరోసారి రుజువు చేసుకుంది. లీగ్, సూపర్-8లో ఓటమి ఎరుగక సెమీస్‌కు చేరిన దక్షిణాఫ్రికా.. నిర్ణయాత్మక సెమీస్‌లో న్యూజిలాండ్ చేతిలో 9వికెట్ల తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూసింది. దీంతో మరోసారి టైటిల్‌కు రెండడుగుల దూరంలో టోర్నీనుంచి నిష్క్రమించింది. ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన తొలి సెమీస్‌లో న్యూజిలాండ్ జట్టు దక్షిణాఫ్రికా నిర్దేశించిన 170 పరుగుల లక్ష్యాన్ని 12.5 ఓవర్లలో కేవలం ఒక వికెట్ కోల్పోయి సునాయాసంగా లక్ష్యాన్ని ఛేదించింది. అలెన్, సీఫెర్ట్ అర్ధసెంచరీలతో రాణించి తొలి వికెట్‌కు 9 ఓవర్లలోనే 117పరుగులు జత చేశారు. అలెన్(100నాటౌట్; 33బంతుల్లో 10ఫోర్లు, 8సిక్సర్లు) మెరిసి టి20 ప్రపంచకప్ సెమీస్‌లో తక్కువ బంతుల్లో సెంచరీ కొట్టిన ఆటగాడిగా రికార్డు పుటల్లో కెక్కాడు. ఇక సీఫెర్ట్(58; 33బంతుల్లో 7ఫోర్లు, 2సిక్సర్లు) రాణించాడు. దీంతో న్యూజిలాండ్ జట్టు సునాయాసంగా లక్ష్యాన్ని ఛేదించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అలెన్‌కు దక్కింది.

అంతకుముందు వరుసగా వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన సఫారీ జట్టును ఆల్‌రౌండర్ మార్కో యాన్సెన్ మెరుపు అర్ధ శతకంతో ఆదుకున్నాడు. దీంతో ప్రొటీస్ జట్టు గౌరవప్రదంగా ఇన్నింగ్స్ ముగించగలిగింది. టాస్ గెలిచిన న్యూజిలాండ్ సౌతాఫ్రికాను తొలుత బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. తొలుత కివీస్ బౌలర్లు నిప్పులు చెరగడంతో వరుస విరామాల్లో ప్రొటీస్ జట్టు వికెట్లు కోల్పోయింది. ఓపెనర్లు ఐడెన్ మార్‌క్రమ్(18), క్వింటన్ డికాక్(10), ర్యాన్ రికెల్టన్(0) ఘోరంగా విఫలమయ్యారు. డెవాల్డ్ బ్రెవిస్(34) కాసేపు నిలబడగా... డేవిడ్ మిల్లర్(6) కూడా ఇలా వచ్చి అలా వెళ్లారు. దీంతో సౌతాఫ్రికా 77 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో ట్రిస్టన్ స్టబ్స్ (29)తో కలిసి మార్కో యాన్సెన్ కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. వీరిద్దరు కలిసి ఆరో వికెట్‌కు 47 బంతుల్లో 73 పరుగులు జోడించారు.



ఇక ఈ మ్యాచ్‌లో యాన్సెన్ 27 బంతుల్లో అర్ధ శతకం సాధించాడు. లాకీ ఫెర్గూసన్ బౌలింగ్‌లో సిక్స్ బాది అర్ధ శతకంతో రాణించాడు. మొత్తంగా 30 బంతులు ఎదుర్కొని రెండు ఫోర్లు, ఐదు సిక్సర్ల సాయంతో 55 పరుగులతో అజేయంగా నిలిచాడు. కార్బిన్ బాష్ రెండు పరుగులు, కగిసో రబడ డకౌట్ అయ్యాడు. కేశవ్ మహరాజ్ ఒక పరుగుతో నాటౌట్‌గా నిలిచాడు. దీంతో దక్షిణాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో ఎనిమిది వికెట్ల నష్టానికి 169 పరుగులు చేసింది. న్యూజిలాండ్ బౌలర్లు హెన్రీ, కోచీ, రచిన్ రవీంద్రకు రెండేసి వికెట్లు దక్కాయి.

# లైన్‌మెన్‌ల సేవలు చిరస్మరణీయం

**- జిల్లా విద్యుత్ శాఖ జిల్లా అధికారి ఎస్ రమణయ్య**
**- ఘనంగా లైన్మేన్ దివాస్ ఆరవ వార్షికోత్సవం**




**కడప - సూర్య వాస్తవం:** లైన్‌మెన్‌లు తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు మెరుగైనటువంటి సేవలు అందించడంలో ఎప్పుడు ముందుంటారని అలాంటి వారిని మనం గౌరవించుకొని సన్మానించుకోవడం ఎంతో గౌరవప్రదమని విద్యుత్ శాఖ జిల్లా అధికార ఎస్ రమణయ్య, డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హరి సేవ్య నాయక్, ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు బి. రామ లింగారెడ్డిలు తెలిపారు. బుధవారం వారు కడప విద్యుత్ కార్యాలయంలో ఓ అండ్ ఎం యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆరవ వార్షికోత్సవ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా విచ్చేసి రిటైర్డ్ లైన్మెన్లను, ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న లైన్మెన్లను ఓ అండ్ ఎం ఆర్మీ కార్మికుల ఆధ్వర్యంలో వారు శాలువాలు ,పుష్పగుచాలు అందజేసి ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, లైన్మెన్లు తమ జీవితాన్ని పణంగా పెట్టి ఎండనక, వాననక, గాలి ఆనక అహర్నిశలు శ్రమించి ప్రజలకు నిరంతర విద్యు అందించేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. అత్యవసర పరిస్థితులలో, విపత్కర పరిస్థితులలో ప్రాణాలను సైతం లెక్కచేయ కుండా విధులు నిర్వహించి ప్రజలకు విద్యుత్ అంత రాయం కలగకుండా తమదైన శైలిలో ప్రజలకు సేవలు అందించడమే మహాభాగ్యంగా భావిస్తారని లైన్మెన్ లా జీవితంపై వారు కొనియాడారు. అలాగే రిటైర్డ్ లైన్మెన్లు కాలంలో ఎదుర్కొన్న అనుభవాలను పంచుకుంటూ, ప్రస్తుతం విద్యుత్ శాఖలో పనిచేస్తున్న లైన్మెన్లు భద్రతాభావంతో తమ నియమాలను కచ్చితంగా పాటిస్తూ, తమ కుటుంబాలను కూడా గుర్తు చేసుకుంటూ పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. లైన్మెన్లు ఎప్పటికప్పుడు అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకుని కర్తవ్య నిబద్ధత, సేవా భావంతో ఎల్లప్పుడు ముందు ఉండి పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో పలువురు ఓ అండ్ ఎం సిబ్బంది, కార్మిక సంఘాల ప్రతినిధులు, అధికారులు పాల్గొని లైన్మెన్ల సేవలను కొనియాడారు. సన్మాన గ్రహీతలకు స్మారక చిహ్నాలతో వారిని ఘనంగా సత్కరించారు. సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ, లైన్మెన్ దివాస్ సందర్భంగా విద్యుత్ రంగంలో సేవలందించిన వారందరికీ గతంలో ఎన్నడు లేని విధంగా ఇంత పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని నిర్వహించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. ఇదే సంతోషంతో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సంకల్పాన్ని వారు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్లమో ఇంజనీర్ అసోసి యేషన్ నాయకులు నాగరాజు, రామకృష్ణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగ శేషారెడ్డి పాల్గొని లైన్మెన్ లకు తమ అమూల్యమైన సందేశాన్ని అందించడం జరిగింది. అనంతరం లైన్మెన్లు మాట్లాడుతూ, విద్యుత్ రంగంలో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు తమ వంతు కృషి చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓ అండ్ ఎం యూనియన్ నాయకులు డి దొరబాబు, బి మురళీమోహన్, జి చంద్రబాబు రెడ్డి, ప్రేమ్చంద్, దస్తగిరి, హరి ప్రసాద్, మౌలా ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.





## కోట్ల రాఘవేందర్ రెడ్డికి సత్కారం

**డోన్ - సూర్య వాస్తవం:** డోన్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కోట్ల రాఘవేంద్ర రెడ్డిని శాలువాతో సన్మానించడం జరిగింది అనంతరం, నంద్యాల జిల్లా బిజెపి యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన యస్. విజయభాస్కర్, జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన అరుణ్ కుమార్ కి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో బిజెపి మాజీ జిల్లా కార్యదర్శి రామచంద్ర నాయుడు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోట్ల రాఘవేంద్ర రెడ్డి గారు మాట్లాడుతూ, నూతన బాధ్యతలు స్వీకరించిన యువ నాయకులు కూటమి ప్రభుత్వంలో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తూ పార్టీ బలోపేతానికి శ్రమించాలని సూచించారు. బాధ్యతలు స్వీకరించిన నాయకులు తమపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలుపుతూ, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజా సేవలో ముందుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా టీడీపీ కన్వీనర్ రామమునిరెడ్డి పుట్టిన రోజు వేడుకలు



**వేంపల్లె - సూర్య వాస్తవం:** వేంపల్లె మండల టిడిపి కన్వీనర్ రామమునిరెడ్డి పుట్టిన బుధవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. టిడిపి మండల కన్వీనర్ రామ మునిరెడ్డి పుట్టిన రోజు సందర్భంగా బుధవారం వేంపల్లెలోని టిడిపి కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు నామా వేమకుమార్ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు మధ్య టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి కేక్ ను కట్ చేసి పలువురికి పంపిణి చేశారు. అలాగే శాలువతో ఆయనను కార్యకర్తలు సత్కరించి మరిన్ని పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవాలని పలువురు అన్నారు. తన పుట్టిన రోజు వేడుకలను నిర్వ హించడం సంతోషంగా ఉందని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి తెలిపారు. తనకు అభిమానిస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్తల అభిమానం మరవలేనని చెప్పారు. ఇదే అభిమానంతో టిడిపి పార్టీ అభివృద్ధికి కూడ తనకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు నామా వేమకుమార్, బిసి మండల నాయకుడు డక్కా రమేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## దాతల సహకారంతో పలు సేవా కార్యక్రమాలు



**డోన్ - సూర్య వాస్తవం:** డోన్ పట్టణానికి చెందిన స్వర్గీయ బచ్చు జ్యోతి స్వరూప జ్ఞాపకార్థం వారి భర్త బచ్చు చక్రి మరియు వారి కుటుంబ సభ్యుల సహకారంతో బుధవారం స్ఫూర్తి సభ్యులు సంస్థ ఆధ్వర్యంలో డోన్ పాత బస్టాండ్ నందు మజ్జిగ పంపిణీ చేశారు. దానితో పాటు బిన్నూ షోరూం దగ్గర ప్రజల సౌకర్యార్థం ఉచిత మినరల్ వాటర్ చలివేంద్రంని ప్రారంభించారు. అదేవిధంగా స్వరూప పేరున వివేకానంద సర్కిల్ నందు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్ఫూర్తి సభ్యులు కొండపేటకు చెందిన స్వర్గీయ కరణం మాధవ జ్ఞాపకార్థం డోన్ ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసి వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చిన వందలాది మంది పల్లె ప్రజల ఆకలి తీర్చారు. ఈ సందర్భంగా స్ఫూర్తి సభ్యులు జ్యోతి స్వరూప, కరణం మాధవ లకు నివాళులు అర్పించి, సేవా కార్యక్రమాలు చేయించిన వారి వారి కుటుంబ సభ్యులకు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాతలు బచ్చు చక్రి, వారి మిత్ర బృందం, కరణం మాధవ కుటుంబ సభ్యులు, స్ఫూర్తి సభ్యులు మధు, చంద్ర, వసంత్, రాజు, శివయ్య, భాస్కర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థి జీవితంలో డిగ్రీ కోర్సు చాలా కీలకమైంది




**వేంపల్లె - సూర్య వాస్తవం:** విద్యార్థి ఉన్నత చదువులను అధిరోహించి మంచి ఉద్యోగ స్థానానికి ఎదగడానికి డిగ్రీ జీవితం చాలా కీలకమైనది అని జవహర్లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం న్యూఢిల్లీ చరిత్ర ఆచార్యులు డాక్టర్ పువ్వాడి వేణు అన్నారు. స్థానిక వైయస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర, తెలుగు శాఖ సంయుక్తంగా నిర్వహించిన ఒకరోజు సదస్సుకు ముఖ్య వక్తగా విచ్చేసిన జవహర్లాల్ నెహ్రూ యూనివర్సిటీ చరిత్ర శాఖ సహాయ ఆచార్యులు, డాక్టర్ పువ్వాడి వేణు విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతూ జీవిత అభివృద్ధి అవకాశాలు సవాళ్లపై ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యా మరియు వృత్తిపరమైన అభివృద్ధికి వచ్చిన ప్రతి అవకాశాన్ని సభ్యులు ఉపయోగించుకోవాలని దానికి ఎన్నో సవాళ్లు ఎదురైనప్పటికీ సమయాభావాన్ని బాగా ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అంతేకాకుండా అధ్యాపకులు తమ వృత్తిలో ఎంతో బిజీగా ఉన్నప్పటికీ పరిశోధన పట్ల శ్రద్ధ వహించినట్లయితే కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో నడుస్తున్నటువంటి అనేక పరిశోధన సంస్థల గురించి, ఆ సంస్థల నిధుల నుంచి నిధులను సంపాదించవచ్చని ఆయన సోదాహరణంగా వివరించారు. డిగ్రీ కళాశాల అధ్యా పకులు సరైన రీతిలో వ్యవహరించి డిగ్రీ విద్యార్థులకు తగిన సూచనలు ఇచ్చినట్లయితే వారు విశ్వ విద్యాలయంలో సీట్లు సంపాదించడంతోపాటు తదనంతరం జేఆర్ఎఫ్, ఎస్ఆర్ఎఫ్ లాంటి పరిశోధనలకు దోహదపడే పరీక్షలలో విజయం సాధించి దేశ స్థాయిలో మంచి పేరు సంపాదిస్తారని అన్నారు. ఆంగ్లం, తెలుగు అనే మాధ్యమంతో సంబంధం లేకుండా దేశీయ స్థాయిలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో కూడా అన్ని భాషలకు తగిన అవకాశాలు ఉన్నాయని వివరించారు . ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రముఖ చరిత్రకారుడు, కళాశాల చరిత్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ బాలకొండ గంగాధర మాట్లాడుతూ చరిత్ర చదివిన విద్యార్థులకు అనేక అవకాశాలు ఉన్నాయని అంతేకాకుండా చరిత్ర చదివిన విద్యార్థులు మాత్రమే రాష్ట్రము మరి కేంద్ర ప్రభుత్వం నిర్వహించే అనేక పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తారని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ ఎస్.నాగేంద్ర ముఖ్యఅతిథిగా పాల్గొని ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా విద్యార్థులకు ఉన్నత విద్యాపట్ల అవగాహన కల్పించడం పట్ల విద్యార్థులకు వారి అభివృద్ధికి దోహద పడుతుందని అభిప్రాయపడ్డారు.

ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ సతీష్ ,డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ ఓబుల రెడ్డి,ప్లేస్మెంట్ ఆఫీసర్ అరవింద్, కంప్యూటర్ అధ్యాపకులు కిరణమయి, శపి ఉద్దీన్ ,రాజారెడ్డి ,ప్రసాదు మరియు ఫిజికల్ డైరెక్టర్ తేజంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం చివరగా తెలుగు శాఖ అధ్యాపకురాలు మరియు ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కన్వీనర్, ఎన్ నాగలక్ష్మి దేవి వందన సమర్పణ చేయడంతో ఈ కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమం లో దాదాపు 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



## శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠంలో వేలం ద్వారా రూ.50 లక్షల ఆదాయం



**బ్రహ్మంగారిమఠం - సూర్య వాస్తవం:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం ప్రాంగణంలో బుధవారం బహి రంగ వేలం పాటలు వీరబ్రహ్మేంద్రస్వామి మఠం మఠాధిపతులు శ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వాముల వారి అనుమతితో వేలం పాటలు నిర్మించగా 50 లక్షలు ఆదాయం వచ్చినట్లు మఠం మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి తెలిపారు. వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో కొబ్బరి చిప్పలు వసూలు చేసుకోను హక్కునకు 22 లక్షల 60 వేలు పోలేరమ్మ గుడి వద్ద కొబ్బరికాయలు అమ్ముటకు 6 లక్షల 90000 పోలేరమ్మ గుడి వద్ద కొబ్బరి చిప్పలు వసూలు చేసుకుని హక్కులకు 3 లక్షల 60వేలు, పార్కు వెలుపల వీర గురు సదనం పక్కన మరుగుదొడ్లు శుభ్రపరచుటకు హక్కునకు 2, లక్షల70వేలు, వీరబ్రహ్మేంద్రస్వామి గుడి వద్ద పాదరక్షలు భద్ర పరచుటకు హక్కునకు 2 లక్షల 60 వేలు, టీటీడీ సత్రం దగ్గరలో మరుగుదొడ్లు శుభ్రపరచి వసూలు చేసుకొనుక్కునకు 7 లక్షల 60వేలు డార్మెంటరీ హాల్ లాకర్ కు 4 లక్షలు మొత్తం 50 లక్షలు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ వేలం పాటలు దేవదాయ ధర్మ దాయ శాఖ రాజంపేట ఇన్స్పెక్టర్ జనార్ధన్ సమక్షంలో నిర్వహించారు. 1-4-2026 నుంచి 31-3-2027 వరకు హక్కు దారులు (ఒక సంవత్సరం పాటు) గత సంవత్సరం 30 లక్షల ఆదాయం ఈ సంవత్సరం 50 లక్షలు వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు వేలంపాట దారులు పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )

# కాటమరాయుడా.. కదిరి నారసింహుడా

**- నవనారసింహ క్షేత్రం కదిరి క్షేత్రం..!!**
**- అంగరంగ వైభవంగా జరుగుతున్న కాటమరాయుడి బ్రహ్మోత్సవాలు**

**శ్రీ సత్య సాయి బ్యూరో - సూర్య వాస్తవం :**
"'బేట్రాయి సామిదేవుడా! నన్నేలినోడు! బేట్రాయి సామి దేవుడా! కదిరి నరసింహుడా! కాటీమరాయడా!' అనే జానపదులు, చెలగి కదిరిలో శ్రీ వేంకటాద్రిమీద యెలగేటి చక్కటి లక్ష్మీ నృసింహము!
శ్రీ వెంకటాద్రి మీద యెలగేటి చక్కటి నృసింహము,
శ్రీ నారసింహమాం పాహి""--
క్షీరాబ్ధి కన్యరా రమణశ్రీ అన్న కీర్తనల్లోని నృసింహస్వామి ప్రాశస్త్యాన్ని కళ్ళారా తెలుసుకోవాలంటే ఈఆలయాన్ని సందర్శించాల్సిందే.


అతి ప్రాచీనమైనదిగా శ్రీమత్ ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి వారి దేవాలయం వాసికెక్కినది. ఆంధ్రప్రదేశ్ శ్రీ సత్య సాయి జిల్లా కదిరి పట్టణంలో ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయం వెలసి ఉంది. ఇక్కడ హిరణ్యకశ్యపుని సంహారించిన అనంతరం ఉగ్రస్వరూపులైన శ్రీనరసింహస్వామి వారిని కదిరి పట్టణగల "స్తోత్రాద్రి" పర్వతము వద్ద ముక్కోటి దేవతలు, భక్తప్రహ్లాదుడు శాంతింపచెసిరి.. అందువలనే ఈ క్షేత్రమున ప్రహ్లాద సమేత నృసింహస్వామి దేవాలయము వెలసినదని చరిత్ర చెబుతోంది. క్షీరసాగరమందు భుజంగం పై శయనించే పరంధాముని దశావతారములో నరసింహావతారం మిగిలిన అవతారాల కంటే విశిష్టమైనది.. రామావతారం, క్రిష్ణావతారాలలో భూమిపై కొంత కాలం మానవాకారంలో జీవించిన విష్ణువు నరసింహావతారం స్వల్పకాలం లోనే ముగించాడు. మిగిలిన అవతారాలు ప్రజల క్షేమం కొరకో లేదా భక్తులను కాపాడుట కొరకో అవతరించినవి. అయితే ఈ నరసింహావతారం ఒక అసుర కులంలో జన్మించిన ఒక భక్తుని కొరకు, అతని పవిత్రమైన భక్తికి దేవుడి కానుకగా భూలోకంలో అవతరించెను. నరసింహావతారంలో ఆ స్వామి సగభాగం మృగంలా, మిగతా భాగం మానవ రూపంలో, ఉగ్రంగానూ, ఆవేశంగానూ భూలోకానికి..తన భక్తుని కొరకు వచ్చి ఆ తర్వాత ప్రశాంతతను పొంది, అక్కడక్కడ దర్శనమిచ్చి కొలువై వున్నాడు..

శాంతమూర్తిగా ఆ స్వామిని దర్శించిన భక్తులు పొందిన సంతోషాన్ని, వారికి దక్కిన మహద్భాగ్యాన్ని మిగిలిన భక్తులకు దక్కేందుకు సాలగ్రామం రూపంలో భూలోకంలో వెలిశాడు. అలా స్వామివారు కొలువైన పుణ్యక్షేత్రమే కదిరి..
"ఖా" అనగా విష్ణు పాదమనియు
"అద్రి" అనగా పర్వతము అనియు అర్థము.
ఈ ప్రాంతములో స్వామి వారు పాదము మోపినందున ఈ పట్టణమును "ఖాద్రీ" (కదిరి) అని పిలువబడుచున్నది.
ఒరిస్సా రాష్ట్రములోని పూరీ పట్టణములో వెలసియున్న కొయ్య జగన్నాథునివోలె ఈ క్షేత్రమున నరసింహస్వామి వారు చంద్రవృక్ష (ఖదిరి వృక్షము) కొమ్మపై చాల కాలము వెలసియున్నారని ప్రతీతి. కదిరి వృక్షం కింద వెలసి ఉన్న స్వామి వారున్న ఈ ఊరు కాలక్రమేణా కదిరి అయింది.






ప్రసిద్ధి చెందిన ఈ కదిరి క్షేత్రం నలువైపులా నాలుగు గోపురాలతో వున్న ఈ ఆలయం ఎంతో అందంగా నిర్మించబడింది. తూర్పు రాజగోపురం ద్వారం దాటి లోపలికి వెళ్తే కుడివైపున సీతారామలక్ష్మణుల విగ్రహాలున్న సన్నిధి దర్శనం ఇస్తుంది. గర్భగుడిలో నరసింహస్వామి. అష్టభుజాలు, హిరణ్యకశకుడిని తొడపై పెట్టుకుని తన రెండు చేతులతో అసురుణ్ణి తలను, కాళ్లను పట్టుకున్నట్టున్న విగ్రహం. మిగతా రెండు చేతులతో పదునైన గోళ్ళను చూడచ్చు. మిగతా నాలుగు చేతులతో శంఖు, చక్రం, ఖడ్గం మొదలైనవి ఉన్నాయి. పదునైన కోర పళ్లు కూడా కనిపిస్తాయి. ఏ అవతారం హిరణ్యకశిపుడిని అంత మొందించిందో అదే అవతారం ఇప్పుడు భక్తులను కరుణించి కటాక్షిస్తోంది. ఏ నేత్రాలు ఆ అసురుడిని రౌద్రంగా వీక్షించాయో అవే నేత్రాలు ఇప్పుడు భక్తులను కరుణతో వీక్షిస్తున్నాయి. స్వామివారికి అలంకరించిన అమూల్యమైన ఆభరణాలతో దర్శించే భక్తులు జన్మ తరించిపోతుంది. స్వామి వారికి పక్కనే భక్తితో ప్రణమిల్లుతున్న ప్రహ్లాదుడు. ఈ క్షేత్రములోని స్వామి స్వయంభువు. దానికి నిదర్శనగా అభిషేకానంతరం స్వామివారి హృదయ భాగంపై స్వేద బిందువులు ఏర్పడతాయట. గర్భగుడి ప్రక్కనే సన్నిధికి ఎడమవైపు శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వామి ఉత్సవ విగ్రహాలు అలంకారాలతో ఎంతో అందంగా దర్శనమిస్తాయి. గర్భగుడికి ఎడమవైపున అమృతవల్లి దేవి ఆలయం. దేవి ఆలయానికి ఎదుటనున్న మండప స్తంభాలపై చిన్న శిల్పాలున్నాయి. నరసింహస్వామి అందానికి పోటీ పడేట్టున్న అమృతవల్లి విగ్రహం వజ్రపు ముక్కుపుడక నొసట తిలకము వజ్రపు ప్రకాశం తలదన్నేట్టుగా వుంది. ఉత్సవ విగ్రహం గజలక్ష్మి రూపంలో దర్శనమిస్తుంది. అమ్మవారు ఎదుట శ్రీచక్రం ప్రతిష్టించారు. ఈ ఆలయానికి వచ్చిన భక్తులు సకల ఐశ్వర్యాలతో సుఖంగా జీవించగలరు. అందుచేతనే ఈ ఆలయానికి ఎప్పుడూ కిక్కిరిసే భక్తజన సందోహం. బయటకి వస్తే అశ్వర్థ వృక్షం కింద ప్రతిష్ట చేసిన నాగ విగ్రహాలు.. ప్రాకారాన్ని ప్రదక్షిణ చేసి వస్తే అర్థమండపం. ఎడమవైపున నీడనిచ్చే రెండు మహావృక్షాలు.. స్వామి వారు స్వప్నమున అదేశించిన విధముగ విజయనగర రాజైన వీరబుక్కరాయలు 1274-1275 సంవత్సరములలో ఖదిరి వృక్షము క్రింద పుట్టలో యున్న సాలగ్రామములును బయటకు తీసి ఈ దేవాలయంలో ప్రతిష్ఠించారు. ఈ సాలగ్రామములు కాలగతిలో అదృశ్యమైనందున 1545లో విజయనగర రాజు అయిన అచ్యుత దేవరాయలు శ్రీవారి స్వప్న అదేశముల మేరకు ప్రస్తుతము ఈ క్షేత్రమున అష్టబాహులతో హిరణ్యకశ్యపుని



సంహరించు చందమున యున్న రాతివిగ్రహముగా విరాజిల్లుతున్న మూలవర్లను స్తోత్రాద్రి పర్వత గృహల నుండి (స్వామి వారి అదేశములమేరకు) తీసుకొని వచ్చి ఈ దేవాలయమున ప్రతిష్ఠించిరి. శ్రీనృశింహ స్వామివారే శ్రీ భృగు మహర్షికి ఆర్చనార్థం వసంతవల్లభుల విగ్రహములను ఒక పేటికలో యుంచి ప్రసాదించిన అవిగ్రహములను స్వామి వారి స్వప్న ఆదేశముల మేరకు భృగుతీర్థము నుండి బయలుకు తీసిన వసంతవల్లభుల ఉత్సవ విగ్రహములను, స్వామి వారి ప్రస్తుత మూలవిరాట్టును అత్యంత వైభవముగా,రాజసం ఉట్టిపడురీతిన ఆడంబరముగా వసంతఋతువులో ఈ దేవాలయంలో ప్రతిష్ఠించినందున ఉత్సవవిగ్రహములను వసంతవల్లభులుగా నామంతరం చెందినారు. ఈ పట్టణము ఖదిరి వృక్షములతో నిండిన కికారణ్యమైనందున అప్పటి పాళెగారు ఈ వృక్షములను శుభ్రంచేయించి ఇచ్చట ఈ దేవాలయమును నిర్మించినారని ప్రతీతి....

బ్రహ్మాండ పురాణములలో ఖాద్రి స్థలపురాణం ఎంతో విపులంగా చర్చింపబడియున్నది. కదిరి పరిసర ప్రాంతములన్నియు పౌరాణిక గాధలతో ముడిపడియున్నవి. వేదవ్యాస మహర్షి వారు తన శిష్యులు ఉనికిని రాక్షసులకు తెలియకుండా వారికి విద్యాబుద్దులు ఇచ్చట నేర్పించినందున ఇది కేదారణ్యమైనది. అర్జునుడు తపస్సు చేసిన మద్దిలేరు (అర్జున నది). ఈ ప్రాంతంలో.. శ్వేతపుష్కరిణి, భృగుతీర్థము, శేష తీర్థము, కుంతితీర్థము, లక్ష్మీతీర్థము, గంగాతీర్థము, గరుడతీర్థము, భావనాశిని తీర్థములను తాకుతూ ప్రవహించుచూ ఈ నది విరాజిల్లుతున్నది...

ఈ దేవాలయంలో మొదట పశ్చిమ చాళుక్యులు 985-1076సం॥ మధ్య దుర్గాదేవి దేవాలయమును క్రిష్ణవర్ణ శిలలుపై అతి సుందరముగా చెక్కిన శిల్పములతో నిర్మింపగా విజయనగర రాజుబు వీరబుక్కరాయులు 1274-1275 మధ్యలో స్వప్నమున నృశింహస్వామివారు ఆదేశించిన విధంగా స్వామి వారి సాలగ్రములను ఖదిరి వృక్షం క్రిందయున్న పుట్టలో నుంచి బయటకు తీసి దుర్గాదేవి దేవాలయమునకు దక్షణమున అమ్మవారి దేవాలయము వోలె సుందరశిల్పములతో ఈ నృసింహక్షేత్రమును నిర్మించి..ఇందులో ప్రతిష్టించెను ద్వారపాలకులు, గరుడర్యాములను, అనేకమండపములను నిర్మించెను. 1953లో దుర్గాదేవి విగ్రహముకు బదులు లక్ష్మీ అమ్మవారిని ప్రతిష్ఠించడమైనది. దుర్గాదేవి మూలవిగ్రహమును ఇప్పటికి అమ్మవారి దేవాలయములో చూడవచ్చును.......

- 1391లో నరసింహదాసరి, లక్ష్మణదాసరి అనేభక్తులు చాలా ఎత్తైన దీపపు రాతి స్థంభములును దేవాలయం లోపల బయట పెట్టినారు.
- 1509లో శ్రీకృష్ణదేవరాయ మహారాజు సింహ ప్రతిమలతో యున్న మండపం (రంగమండపం)ను,
ఆళ్వార్ల సన్నిదర్లును నిర్మించెను.
- 1545లో అచ్యుత దేవరాయ ప్రభువు తూర్పు
- రాజ గోపురం, వినాయక, క్రిష్ణమందిరములు, రాఘవేంద్ర బృందవనాలను నిర్మించినారు.
- 1569లో శ్రీ తిరుమలరాయల మండపాలు పుష్కరిణులను నిర్మించినారు.

ఈ దేవాలయములో విజయనగర రాజుల శిలాశాసనములున్నవి.





ఛత్రపతి శివాజి మహరాజు ఈ దేవాలయం వెలుపల మహిషాసుర మర్ధిని దేవాలయాన్ని 1642-1644 మధ్యలో నిర్మించారు. దక్షిణ భారతంలో కెల్లాఎక్కువ బరువుకల్గి, శృంగార చెక్కడములతో యున్న చెక్కరథం తేరుయున్నది. దేవాలయము తూర్పు, దక్షణ పడమర రాజగోపురలను విజయనగర రాజులు, చిన్నమ్మ, కొక్కంటి పాలెదార్లు నిర్మించినారు. కదిరి గ్రామం ఒకప్పుడు మైసూరు రాజ్యములో యుండినదని తెలియుచున్నది. శిలా శాసనముల ప్రకారం ఈ దేవాలయం విజయనగర సామ్రాజ్య కాలములో అభివృద్ధి పరుచబడినది. ఈ శాసనాల ప్రకారం బుక్కరాయలు ఈ దేవాలయమును 1274 లో నిర్మించినారనియు మరియొక శాసనం ప్రకారం శ్రీరంగం దేవాలయలయన్ని జీర్ణోద్దారణ చేసిన కెంపెన్న ఒడయరు వద్ద పనిచేసిన అధికారైన కొపన్న ఈ దేవాలయనికి బంగారు అభరణముల నొసిగినారు. 1451, 1529 సంవత్సరములలో తాడిపత్రి పాళెదారు వేయికాళ్ళ మండపాన్ని కొఠాయి మండపములను నిర్మించారు.

**ఆలయ విశిష్టత:** ఇక్కడికి భక్తులు సమీపంలోని తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుండి కూడ వస్తుంటారు. ఇక్కడి ఇంకో విశేషమేమంటే, కదిరి పట్టణానికి సుమారు ఇరవై ఐదు కిలో మీటర్ల దూరంలో తిమ్మమ్మ మర్రి మాను ఉన్నది. ఇది ఏడున్నర ఎకరాల స్థలంలో విస్తరించి,
1100 ఊడలతో ఉన్నది. దీని వయస్సు సుమారు ఆరు వందల సంవత్సరాలు ఉంటుందని నమ్మకం. ఇది గిన్నిసుబుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ లో కూడ స్థానం సంపాదించుకున్నది. కదిరికి పన్నెండు కిలోమీటర్ల దూరంలో కటారు పల్లె లో యోగి వేమన సమాధి కూడ వున్నది. ఇది కూడ పర్యాటకులను ఆకర్షిస్తున్నది.

**ఉత్సవాలు:** ప్రతి సంవత్సరం ఉత్తరాయణంలో తొలి పండుగగా జరుపుకొనే సంక్రాంతి వేడుకల తరవాత ఇక్కడ ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ముఖ్యంగా సంక్రాంతి పండుగలో భాగంగా జరుపుకునే పశువుల పండగ రోజున శ్రీదేవి భూదేవిలతో కలిసి వసంత వల్లభులు కదిరి కొండకు పారువేట నిమిత్తం వస్తారనే విశ్వాసం ప్రజల్లో ఉంది. అందుకే పాలు పొంగు వేడుక తర్వాత పారువేటానంతరం పురవీధుల్లో ఊరేగిస్తూ స్వామి వారిని ఆలయంలోకి తీసుకొస్తారు. దీన్నే రథోత్సవం అంటారు.
ఏటా ఫాల్గుణ మాసంలో బహుళ పంచమినాడు ఇక్కడ జరిగే రథోత్సవం సందర్శకుల్ని విశేషంగా ఆకర్షిస్తుంది. ఉత్సవంలో ఊరేగింపు రథం సుమారు 120 టన్నుల బరువుంటుంది. ఆరు చక్రాలుండే ఈ రథం 45 అడుగుల ఎత్తు ఉంటుంది. వెనుక చక్రాలకు తెడ్డును అమర్చి, దీన్ని పురవీధుల్లో ఊరేగిస్తారు. రథోత్సవం సమయంలో స్వామివారి రథంపై దవనం, మిరియాలు, పండ్లు చల్లుతుంటారు. కిందపడిన వీటిని ఏరుకొని తింటే సర్వరోగాలూ నయమవుతాయని భక్తుల విశ్వాసం. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు ఫాల్గుణ బహుళ పౌర్ణమిని కదిరి పున్నమిగా జరుపుతారు. ఆ రోజు భక్తులు ఉపవాసముంటారు.
ఏటా ఆలయంలో.. నృసింహ జయంతిని వైశాఖ శుద్ధ చతుర్దశి, మల్లెపూల తిరుణాళ్ళను వైశాఖ శుద్ధ పౌర్ణమి. చింతపూలతిరుణాళ్ళను ఆషాడ శుద్ధ పౌర్ణమి, ఉట్ల తిరుణాళ్ళను శ్రావణ బహుళ నవమి, దసరా వేడుకల్ని వైకుంఠ ఏకాదశి రోజుల్లో జరుపుతారు. వైఖానన ఆగమ శాస్త్రం ప్రకారం ఇక్కడ ప్రతిరోజూ స్వామి వారికి పూజలు నిర్వహిస్తారు. ముందుగా ఉదయం నివేదన, ఆర్జిత అభిషేక పూజ, సర్వదర్శనం, కల్యాణోత్సవం, మధ్యాహ్న నివేదన, సాయంకాలం నాలుగున్నర గంటల నుంచి సర్వదర్శనం, సాయంకాల నివేదన, తర్వాత మళ్ళీ సర్వదర్శనం ప్రారంభమవుతుంది.

# బ్రహ్మా గరుడ సేవ అలంకారంలో నారసింహస్వామి

**శ్రీ సత్య సాయి బ్యూరో - సూర్య వాస్తవం :** శ్రీవారి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి 6వ రోజు బ్రహ్మగరుడ అవతారంలో ఖాద్రీశుడు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ ఉత్సవాన్ని తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో త్వరలో వచ్చారు. ఖాద్రీ ఆలయ డిప్యూటీ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి వెండిదండి శ్రీనివాస్ రెడ్డి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఖాద్రి లక్ష్మీనరసింహస్వామిని అలంకారమంటపంలో అంగరంగ వైభవంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవానికి బెంగళూరుకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్తలు ఉభయ దారులుగా వ్యవహరించారు. డి.ఎస్.పి శివ నారాయణస్వామి ఆధ్వర్యంలో సిఐలు నారాయణరెడ్డి నాగేంద్ర ఎస్సైలు బాబ్జాన్ నర సింహుడు దిలీప్ కుమార్ తదితరులు బందోబస్తు పర్యవేక్షించారు.

**శ్రీ కదిరి కంభమురాయ గరుడ సేవ ,**
**దిక్కు దిక్కుల కెల్లా దివ్య నేత్రోత్సవం**

నమః పన్నగ నద్దాయ వైకుంఠ వసవర్దినే ,శృతి చిందు సుద్ధోత్పద మందరాయ గారుత్మతే. సర్పాలను భూషణలుగాధరించి ,వేదలనే సముద్రం నుండి విద్యలనే అమృతాన్ని ఉత్పాతించే మందర పర్వతం వంటి సూపర్ణుడి రెక్కలు రెండు కర్మ,జ్ఞాన కాండలు, సర్ప భూషణుడైన గరుత్మంతుడు, శేషుడిని చేతి కంకణంగా ,యజ్ఞోపవీతం వాసుకి ,మొలనూడు తక్షకుడు, కంఠ హారం కర్కోటకుడు, కర్ణకుండలాలు పద్మం మహపద్మం,కిరీటం సంక పాలుడు, బుజకీర్తులు గుళికలు వేల మాటాలెందుకు వేదాత్మ విహగేశ్వర సర్వ అంగాంగాలు వేదస్వరూపలుగా, బ్రహ్మ జరుపుతున్న బృహత్తర ఉత్సవాలలో నేడు బ్రహ్మ గరురుడై
శ్రీ ఖాద్రి నృసింహుడి కి వాహనంగా,దాసుడిగా, మిత్రుడిగా, విసనకర్రగా, అసనంగా, అవాసంగా, ధ్వజంగా సప్త విద కైంకర్యాలు చేస్తూ అనేక విధాలుగా శ్రీ ఖాద్రీసుడిని సేవిస్తున్నాడు. 'ఛందోమయేన గరుడేన సముహ్యామాన:' అని శ్రీమద్భాగవతము చెప్పినట్లు భగవంతుడు గరుడుని అధిష్టించే పయనం కొనసాగిస్తాడు. పురాణాల ప్రకారం గరుత్మంతుడు(వేదాల ప్రతిరూపం) విష్ణు పురాణం. గరుత్మంతుడు నిత్యసూరి, గరుత్మశీతు నికి తెలియని స్వామి రహస్యాలు లేవు,అని తెలియజేస్తుంది గరుడపురణం గరుడని - పెరియతిరువడి -అనడం వైష్ణవ సంప్రదాయం. గరుడారూదుడైన ఈ స్వామిని,నారదాది భక్తపుంగవులు, వర్ణించిన తిరు మనోహరం. వేద స్వరూపుడైన గరుత్మంతుడు వైదికములైన సామాధులకు ప్రతిరూపాలైనా అంగప్రత్యాంగాలు కలవాడు. శ్రీమహావిష్ణువు గరుడ సమ్మేళనం, వేదస్వరూప శీర్షాలుగా తెలుస్తుంది. స్వామి బ్రహ్మోత్సవాలకు ముక్కొటి దేవతులకు ఆహ్వానం పలికే గరుడుడు. ఉత్సవాలలో ధ్వజారోహణం నుండి 5వరోజు అనగా పంచవేదాలు, గరుడ పంచాక్షరిలోని పంచవర్ణ రహస్యం తెలిపే విధంగా స్వామివారి గరుడోత్సవం జరుగుతుంది.వాహనంగా, దాసుడిగా, మిత్రుడిగా, విసనకర్రగా, అసనంగా, అవాసంగా, ధ్వజంగా అనేక విధాలుగా గరుత్మంతుడు శ్రీ ఖాద్రీసుడిని సేవిస్తున్నాడు. గరుడ వాహనం పై విహరించే ఉత్సవమూర్తికి ధ్రువభేరమైన శ్రీ ప్రహ్లాద వరద నరసింహుడికి భేదంలేదని చెప్పడానికే, ఈరోజు నిత్యం మూలమూర్తి అభరణాలైనా అష్టోత్తర విష్ణు సాలగ్రామ మాల, యజ్ఞోపవీతం, సుదర్శన సాలగ్రామ మాల అలంకరిస్తారు. ఉత్సవ సందర్భంగా ధ్వజస్తంభ అభిముకంగా గల గరుడ దీప స్తంభం వద్ద ,ప్రధాన ఆచార్యులు ఆలయ మర్యాదలతో వొచ్చి,లోక కల్యాణం కోసం, విశేష గరుడ దీపోత్సవం జరుపబడటటం పురాతన సంప్రదాయం,





అనంతరం స్వామి వారికి ఆస్థాన పూజ,రక్ష దారణం, అక్షతారోపనం,పూర్ణ కుంభ హారతి గావించి, అర్చకులు ఛత్ర చామరములు వంటి రాజోపచారములు చేయుచుండ గరుడోత్సవంలో ,రాజగోపుర మహాద్వారంలో మోక్ష నరసింహుడై ప్రసన్న వదనుడిగా దర్శించడం ద్వారా సకల సౌభాగ్యాలు, మోక్షం కలుగుతాయని భక్తుల ప్రగాడా విశ్వాసం. సర్వకాల సర్వావస్థాలందు తనను శరణు కొరిన భక్తులను రక్షించేందుకు శంఖ చక్రధారై గరుడుని అదిరోహించి సిద్ధంగా ఉంటానని నా పాదాలను ఆశ్రయించండి చెప్పడమే గరుడసేవలోని పరమార్థం. శ్రీవారిని విశేష మృదంగా వాద్యముల కీర్తనలతో,కోలాటాది భజనలతో, చతుర్ మాడ వీధుల్లో ఊరేగే దివ్య దృశ్యాన్ని భక్తులు కనులారా వీక్షించారు. ఓం నమో నరాయనాయ, ఓం నమో మోక్ష నరసింహ నమః అని భక్తుల కీర్తనాలతో, స్మరణతో,
భక్తులు ఆరాధన చేసుకొని, ఖాద్రి క్షేత్రం పునీతమైనది.